# ప్రభాత సమాచారం

https: epaper.
prabhathasamacharam.com

ఆదిలాబాద్ Digital Edition

మంచిర్యాల - కొమురం భీం ఆసిఫాబాద్ - నిర్మల్

■ మంగళవారం | 15 జూలై 2025 | ■ 12 పేజీలు


అబ్దుల్ ఖయ్యూం

## సేవలు మరువలేనివి

■ ఖయ్యూం సంస్మరణ సభలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

■ రూ.లక్ష ఆర్థిక సాయం అందజేత..



12



# కొనలేం తినలేం

## భగ్గుమంటున్న కూరగాయల ధరలు

- ఇటీవల కురిసిన వర్షాలతో దెబ్బన్న పంటలు
- అమాంతం పెరిగిన కూరగాయల ధరలు
- పంట దెబ్బతినడంతో తగ్గిన దిగుబడి
- కర్ణాటక, మహారాష్ట్ర నుంచి కొనుగోళ్లు
- వ్యాపారులకు ట్రాన్స్‌పోర్ట్ ఛార్జీల మోత
- సామాన్యులపై పడుతున్న ట్యాక్సీల భారం
- బెంబేలెత్తుతున్న ఉమ్మడి జిల్లా ప్రజలు..
- కిలోకు రూ.80నుంచి 100పైనే ధరలు..
- వారం, పది రోజుల వ్యవధిలోనే పెరుగుదల
- సామాన్యుడు కొలేని పరిస్థితి..




మార్కెట్‌లో కూరగాయాల ధరలు భగ్గుమంటున్నాయి. సాగు విస్తీర్ణం తక్కువగా ఉండడం, వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేకపోవడం ధరలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఏది కొందామన్నా వామ్మో ఇంత రేటా.. అని కంగుతినాల్సి వస్తోంది. 'ఏం కొనేటట్టు లేదు.. ఏం తినేటట్టు లేదు'.. అన్నట్టు ఉంది సామాన్యుల పరిస్థితి.. పచ్చి మిర్చి ముట్టుకుంటే ఘాటెక్కుతోంది.. బీన్స్ ధరలకు రెక్కలొచ్చాయి.. అన్ని కూరగాయలు తగ్గేదే లే అంటూ ఒక్కసారిగా ఆకాశంలో ఎక్కి కూర్చున్నాయి.. మేమేం తక్కువా అన్నట్లు అన్ని కూరగాయల ధరలు వాటి వెంటే కొండెక్కి కూర్చున్నాయి.. నెల రోజుల క్రితం ఉన్న ధరలతో పోల్చుకుంటే ప్రస్తుతం డబుల్ అవడంతో సామాన్య ప్రజలు వామ్మో అంటున్నారు.. మార్కెట్‌కు ఐదు వందల నోటుతో వెళితే... సగం బస్తా కూడా నిండడం లేదని ప్రజలు వాపోతున్నారు. నెల క్రితం కిలో టమాటా రూ. 20 ఉండగా ప్రస్తుతం రూ. 40కు చేరుకుంది. పచ్చిమిర్చి కిలోకు రూ. 60 ఉండగా ప్రస్తుతం రూ. 100కు చేరుకుంది. అలాగే చిక్కుడు, కాకరకాయ, కాప్సికం, బెండకాయ, క్యాబేజి, బీరకాయ, అలుసంద తదితర కూరగాయల ధరలు మండిపోతు న్నాయి. జిల్లాలో జూన్‌లో సాధారణ వర్షాలు కురిశాయి. టమాటా ఇతర కూరగాయల సాగు కోసం రైతులు నారు పోశారు. సమృద్ధిగా వర్షాలు కురిస్తే ఆ పంటలు ఆగస్టు చివరి వారం వరకు చేతికి వచ్చే అవకాశాలున్నాయి. అప్పటి వరకు కూరగాయల ధరల పరిస్థితి ఇదే విధంగా ఉండే అవకాశం ఉంది.

8లో



2

ప్రభుత్వ బడుల్లో

## సకల సౌకర్యాలు

■ ప్రభుత్వ పాఠశాలలు పేద విద్యార్థులకు వరం

■ నాణ్యమైన విద్యకు కేరాఫ్..

■ జనకాపూర్‌లో విద్యార్థులకు సైకిళ్లను విద్యార్థులకు అందజేసిన మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, డీఈవో



మాదకద్రవ్యాల నిర్మూలనకు

## కృషి చేయాలి

■ మాదకద్రవ్యాల నియంత్రణలో విద్యార్థుల పాత్ర కీలకం..

■ విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగాటూ చదువుకోవాలి

■ మాదకద్రవ్యాలు భవిష్యత్తును నాశనం చేస్తాయి..

■ కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్



కులవృత్తులకు చేయూతనిచ్చేలా

## సంక్షేమ పథకాలు

■ పీఎం విశ్వకర్మ పథకం శిక్షణ సర్టిఫికెట్లను అందజేసిన ఎంపీ నగేశ్, ఎమ్మెల్యే శంకర్ - 12

# ఆదివాసీ గ్రామాలను ఖాళీ చేసే కుట్ర



■ 49 జీవోను రద్దు చేసే వరకు పోరాటం చేస్తాం

■ వాంకిడి అటవీశాఖ చెక్ పోస్టు వద్ద ఆదివాసీల ధర్నా

■ ఐటీడీఏ పీవోకు వినతి పత్రం అందజేత

ఆదివాసీలకు అన్యాయం చేసే జీవో నెంబర్ 49ని రద్దు చేయాలని తుడుం దెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గోడం గణేశ్ డిమాండ్ చేశారు. తుడుందెబ్బ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు తహసీల్దార్‌లకు వినతి పత్రాన్ని అందించడంలో భాగంగా సోమవారం ఉట్నూర్ ఐటీడీఏ పీవో కుష్బూ గుప్తాను కలిసి వినతి పత్రం అందజేశారు.



క్రీడా స్ఫూర్తితో

## ముందుకు సాగాలి

■ విద్యార్థులు తమకు ఆసక్తి ఉన్న రంగాల్లో రాణించేందుకు నిరంతరం కృషి చేయాలి

■ కుమ్రంభీం జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే-11

# ప్రభుత్వ బడుల్లో సకల సౌకర్యాలు

- ప్రభుత్వ పాఠశాలలు పేద విద్యార్థులకు వరం
- నాణ్యమైన విద్యకు కేరాఫ్ ప్రభుత్వ బడులు
- ఉచితంగా యూనిఫాం, పాఠ్యపుస్తకాలు..
- జనకాపూర్ పాఠశాల పూర్వ విద్యార్థి సంతోష్ అందించిన72 సైకిళ్లను విద్యార్థులకు అందజేసిన మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, డీఈవో







**కన్నెపల్లి, జూలై 14 (ప్రభాత సమాచారం)** విద్యార్థులకు సకల సౌకర్యాలతో కూడిన నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం అన్ని ప్రభుత్వ పాఠశాలలలో పూర్తి స్థాయిలో సదుపాయాలు కల్పించడం జరిగిందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని కన్నెపల్లి, మండలం జనకాపూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థి సంతోష్ రావు పాఠశాలకు అందించిన 72 సైకిళ్ళను జిల్లా విద్యాధికారి ఎస్.యాదయ్యతో కలిసి విద్యార్థినీ, విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ తాను చదువుకున్న పాఠశాలకు, పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు సహకరించాలనే మంచి ఉద్దేశ్యంతో సంతోష్ రావు తాను చదివిన పాఠశాలలోని విద్యార్థులకు 72 సైకిళ్ళను అందించడం అభినందనీయమని అన్నారు. పాఠశాలకు దూరంగా ఉన్న విద్యార్థినులు 42 మంది, విద్యార్థులు 30 మందికి సైకిళ్ళను అందించడం జరిగిందని, సైకిళ్ళ పంపిణీతో తరగతిలో విద్యార్థుల హాజరు శాతం మరింత పెరుగుతుందని ఆకాంక్షిస్తున్నానని తెలిపారు. పాఠశాలల అభివృద్ధి, విద్యార్థులకు విద్యాబోధన, సదుపాయాల కల్పనపై ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతో సమీక్షించడం జరుగుతుందని, మండల విద్యాధికారి తమ పరిధిలోని పాఠశాలలను సందర్శించాలని తెలిపారు. ప్రభుత్వం రాష్ట్రంలోని 3వ తరగతి విద్యార్థుల పఠనా సామర్థ్యాలపై జరిపిన సర్వేలో గతంలో 45 శాతం ఉంటే ప్రస్తుతం 75 శాతానికి చేరిందని తెలిపారు. ప్రతి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సౌకర్యార్థం ప్రహరీగోడల నిర్మాణం, మెనూ అమలు, ఆట స్థలం, మూత్రశాలలతో పాటు లేని వాటిని సమకూర్చేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. విద్యార్థులకు చదువుపై ఆసక్తి కలిగేలా విద్యాబోధన చేయాలని, పఠనా సామర్థ్యాలను పెంపొందించాలని, వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులకు ఆసక్తికి అనుగుణంగా విద్య బోధించడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థులకు నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరాలకు ప్రభుత్వ సెలవు దినాలలో కూడా విద్యార్థులు స్వచ్ఛందంగా తరగతులకు హాజరయ్యారని, ఇదే క్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులకు వారి పిల్లల ప్రవర్తనపై ప్రత్యేక దృష్టి సారించేలా అవగాహన కల్పించడం జరిగిందని తెలిపారు. భూములు, ఆస్తులు, వ్యాపారాలు తాతల నుండి వచ్చినా, రాకపోయినా మనం నేర్చుకునే విద్యతో భవిష్యత్తును బంగారుమయం చేసుకోవచ్చని తెలిపారు. ప్రభుత్వం విద్యారంగాన్ని బలోపేతం చేస్తూ అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ఆధ్వర్యంలో అన్ని ప్రభుత్వ పాఠశాలలలో త్రాగునీరు, విద్యుత్, మూత్రశాలలు, అదనపు గదులు ఇతర అన్ని సదుపాయాలు కల్పించి అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులను నియమించి నాణ్యమైన విద్యను అందించడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థులకు చదువులో ఏమైనా సందేహాలు ఉన్నట్లయితే తమ ఉపాధ్యాయులను సంప్రదించి నివృత్తి చేసుకోవాలని, చదువుపై ఆసక్తి పెంచుకోవాలని తెలిపారు. విద్యాశాఖ సమన్వయకర్తలు చౌదరి, సత్యనారాయణ, అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి





- ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా

**ఆదిలాబాద్, జూలై 14 (ప్రభాత సమాచారం)** ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాజర్షి షా అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ట్రైనీ కలెక్టర్ సలోని లతో కలిసి వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి వివిధ సమస్యల పై సమర్పించిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి సంబంధిత అధికారులకు ఇస్తూ తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయా శాఖల కు సంబంధించిన 131 దరఖాస్తులను స్వీకరించడం జరిగిందని తెలిపారు. అనంతరం సీఎం ప్రజావాణి పెండింగ్ దరఖాస్తుల పై ఆరా తీసి త్వరగా పరిష్కరించాలన్నారు. అలాగే ప్రత్యేక అధికారులు రెసిడెన్షియల్ పాఠశాలలు, హాస్టల్స్, రోజూ వారి మెనూ, ఉదయం, మధ్యహ్నం, రాత్రి భోజనం, స్నాక్స్ తదితర పర్యవేక్షించాలని, శానిటేషన్, రిజిస్టు, ఆన్ లైన్ చేకింగ్, ఉపాధ్యాయులు ప్రతీ రోజు పాఠశాలకు వస్తున్నారా? లేదా? ఆరోగ్య పాఠశాల కార్యక్రమం ఎలా జరుగుతుంది, తదితర ఆకస్మిక తనిఖీలు చేయాలనీ, ఆయా శాఖలకు సంబంధించిన అధికారులు తమతమ శాఖల పనితీరును ఆరా తీయాలన్నారు. అనంతరం జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు డిజిటల్ ఎంప్లాయిమెంట్ ఎక్స్చేంజ్ ఆఫ్ తెలంగాణ (డిఈఈటి) ఎంతో దోహదపడుతుందని కలెక్టర్ అన్నారు. వివిధ శాఖల అధికారులతో కలిసి డిఈఈటి సంబంధిత గోడప్రతులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ డి.ఈ.ఈ.టి. ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపర్చడం జరుగుతుందని తెలిపారు. డి.ఈ.ఈ.టి. యాప్ ప్రభుత్వ, ప్రైవేట్ రంగాలలో ఖాళీగా ఉన్న ఉద్యోగాల వివరాలు ప్రతి రోజు నవీకరించబడతాయని, ఉద్యోగాల కోసం శోధించవచ్చని తెలిపారు.




## గెస్ట్ లెక్చరర్లను రెన్యువల్ చేయాలి

### కలెక్టరేట్ ఎదుట నిరసన

**ఆదిలాబాద్, జూలై 14 (ప్రభాత సమాచారం)** త్రీ మెస్ కమిటీతో డెమో తీసుకునే విధానాన్ని రద్దు చేసి, గత సంవత్సరంలో పని చేసిన ప్రతి డిగ్రీ కళాశాలలో గెస్ట్ లెక్చరర్ లను రెన్యువల్ చేసి సర్వీస్ కంటిన్యూ చేయాలని గెస్ట్ లెక్చరర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు రాహుల్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట సోమవారం డిగ్రీ కళాశాల గెస్ట్ లెక్చరర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. డిగ్రీ కళాశాలలు ప్రారంభమై 40 రోజులైనా డిగ్రీ గెస్ట్ లెక్చరర్ లకు రెన్యువల్ చేయకుండా కాలయాపన చేయడంతో అధ్యాపకులకు, విద్యార్థులకు తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. రాష్ట్రంలో 8 యూనివర్సిటీల పరిధిలోని 149 డిగ్రీ కళాశాలలో 1,940 మంది గెస్ట్ లెక్చరర్లు పని చేస్తున్నారని, తమ సేవల పైననే 30 నుండి 90% వరకు కళాశాలలు నడుస్తున్నాయన్నారు. గత సంవత్సరంలో పని చేసిన వారిని రెన్యువల్ తో సర్వీస్ కంటిన్యూ చేయకపోవడంతో విద్యార్థులకు పాఠాలు బోధించే అవకాశం లేకుండా పోయిందని, దీంతో సిలబస్ కాక పాఠాలు అర్థం చేసుకోలేక విద్యార్థుల సందేహాలు తీర్చేవారు లేక విద్యార్థులు అయోమయ గందరగోళ పరిస్థితిలో అవస్థలు పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షులు సుభాష్, కోశాధికారి ఆనంద్, నారాయణ, జావిద్, ప్రవీణ్ కుమార్, వివిధ కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

## ఆలమ భూమిని కాపాడండి

**ముథోల్, జూలై 14 (ప్రభాత సమాచారం)** మండలంలోని ఎడ్‌బిడ్ తాండాలో సమ్మక్క సారలమ్మ ఆలయం భూములను కాపాడాలని ఎడ్ బిడ్ తాండా గ్రామస్థులు సోమవారం తహశీల్దార్ శ్రీలత కు వినతి పత్రం అందజేశారు. ఆలయ భూమిని అక్రమంగా పట్టా చేసుకుని, సాగుచేసుకుంటున్నరని ఆలయ భూమిని కాపాడాలని వారు కోరారు.



## పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

**ఆదిలాబాద్, జూలై 14 (ప్రభాత సమాచారం)** పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్ క్యాంప్ కార్యాలయంలో పొలం బాట రోడ్లు, మరుగుదొడ్లు, గ్రామపంచాయతీ భవనం, అంగన్వాడి కేంద్రాల నిర్మాణాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, నూతనంగా మంజూరైన పనులను ప్రారంభించి, పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. 512 పొలం బాట రోడ్లు (650 కిలోమీటర్లు) 34 కోట్లు, 118 బాలికల మరుగుదొడ్లకు 2.36 కోట్లు, 99 గ్రామపంచాయతీ



భవనాలకు 2.36 కోట్లు, 40 అంగన్వాడీ కేంద్రాల నిర్మాణాలకు 4.80 కోట్లు మంజూరై, పనులు నిర్మాణ దశలో ఉన్నాయని తెలిపారు. అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించేలా సంబంధిత శాఖల అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. పనుల్లో నాణ్యత లోపిస్తే చర్యలు తీసుకోవాలన్నారు. పనులను నిత్యం పరిశీలించాలన్నారు. ఈ సమావేశంలో పంచాయతీరాజ్ ఈఈ శివరాం, సంబంధిత శాఖల అధికారులు అధికారులు పాల్గొన్నారు.

## రోడ్డు మరమ్మతుల కోసం అధికారులకు సూచనలు

**కాగజ్‌నగర్, జూలై 14 (ప్రభాత సమాచారం)** కాగజ్ నగర్ మండలంలోని భట్పల్లి శివారులో దెబ్బతిన్న ప్రధాన రహదారి మరమ్మతుల విషయమై అధికారులకు సూచనలు ఇచ్చిన ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నష్టపరిహారం విషయమై హైకోర్టులో కేసు ముగిసిందని వర్షాకాలం పూర్తయిన తర్వాత పూర్తి స్థాయిలో బీటీ రోడ్డు నిర్మిస్తామని, అంతలోపు మరమ్మతులు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ రాజ్ ఈఈ కృష్ణ, ఏఈ మణిరాజ్, మాజీ ఎంపిటిసి గణపతి, పిర్సింగుల తిరుపతి, మొండి, రామన్న, సత్యన్న, 1రమేష్, పోషయ్య పాల్గొన్నారు.





# ప్రజావాణి ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలి

## నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

**నిర్మల్, జూలై 14 (ప్రభాత సమాచారం)**

ప్రజావాణి ద్వారా వచ్చిన ప్రతి ఫిర్యాదును త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ స్వయంగా పాల్గొని, ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మండలాల వారీగా పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలన్నారు. సంబంధిత శాఖల మధ్య సమన్వయం ద్వారా ప్రజల సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. భూభారతి చట్ట అమలును తహసీల్దార్లు నిరంతరం పర్యవేక్షించాలని, దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటే ప్రక్రియను ఈ నెలాకరులోగా పూర్తి చేయాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల మార్కింగ్ ప్రక్రియ ఇప్పటికే 55 శాతం పూర్తైనట్టు తెలిపారు. మిగిలిన భాగాన్ని తక్షణమే పూర్తి చేసి, నిర్మాణ పనులు ప్రారంభించాలన్నారు. సీజనల్ వ్యాధుల నియంత్రణ కోసం ప్రభుత్వం రూపొందించిన ప్రణాళికలను అమలు చేయాలని ఆదేశించారు. జిల్లాలో రెండో దశ జ్వర సర్వే 34 శాతం పూర్తైనట్టు పేర్కొన్నారు. అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో అవసరమైన మందులు, పరీక్ష కిట్లు సిద్ధంగా ఉంచాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అదనపు మరుగుదొడ్ల నిర్మాణానికి అనుమతులు మంజూరు చేయడం జరిగిందని, ఎంపీడీవోలు వెంటనే పనులు ప్రారంభించాలని సూచించారు. మండలాల ప్రత్యేకాధికారులు తమ పరిధిలోని అన్ని శాఖల పనులను పర్యవేక్షించాలని కలెక్టర్ సూచించారు. రాష్ట్రంలోనే మొట్టమొదటగా నిర్మల్ జిల్లా సంరక్షణ గృహాల్లో ఉండే అనాథ పిల్లలకు ప్రత్యేక ఆరోగ్యశ్రీ కార్డులు అందించామని, వీటి ద్వారా వారికి రూ.10 లక్షల వరకు ఉచిత కార్పొరేట్ వైద్యం అందనున్నట్టు కలెక్టర్ వెల్లడించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ప్రశంసలు పొందిన జిల్లా మహిళా సంఘాలను కలెక్టర్ అభినందించారు. ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో సారంగాపూర్ మండలం తాండ్రా.జి గ్రామానికి చెందిన రైతు సందుపట్ల రాజేశ్వర్‌కు, మల్బరీ ఆకుల సాగుకు షెడ్ నిర్మాణానికి సిల్క్ సమగ్ర-2 పథకం కింద రూ.4.50 లక్షల వ్యయంతో, తొలి విడతగా రూ.93,775 సబ్సిడీ చెక్కును కలెక్టర్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రైతులు వినూత్నంగా ఆలోచించి కొత్త పంటల సాగు చేసి, అధిక లాభాలు సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, ఆర్డీవో రత్నకళ్యాణి పాల్గొన్నారు.





# ఆర్‌టీఐ చట్టాల పుస్తకాల పంపిణీ

**నిర్మల్, జూలై 14 (ప్రభాత సమాచారం)**

ప్రభుత్వ కార్యాలయంలో సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సయ్యద్ హైదర్, సమాచార చట్టంపై ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించే ఉద్దేశంతో ప్రభుత్వ కార్యాలయాల్లో పుస్తకాలు సోమవారం అందించడం జరుగుతుందని అన్నారు. నిర్మల్ జిల్లా అధ్యక్షులు సి.హెచ్. వినోద్, వర్కింగ్ ప్రెసిడెంట్ అబ్దుల్ సాదిక్ ఆధ్వర్యంలో ఈరోజు నిర్మల్ ఆర్‌డీవో కార్యాలయంలో పీఐఓ (పబ్లిక్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్) ఏ.ఓ.కి సమాచార హక్కు చట్టాల పుస్తకాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ, సమాచార హక్కు చట్టం సామాన్యుడికి ఒక బ్రహ్మాస్త్రం లాంటిదని, ఇది ప్రజలందరికీ అందుబాటులో ఉండాలని ఉద్ఘాటించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో పారదర్శకతను పెంచడంలో ఈ చట్టం కీలక పాత్ర పోషిస్తుందని వారు తెలిపారు. ఆర్‌టీఐ చట్టంపై అవగాహన కల్పించడం, దాని అమలును పర్యవేక్షించడం తమ కమిటీ ప్రధాన లక్ష్యమని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సహా చట్ట హక్కు పరిరక్షణ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# కేజీబీవీ విద్యాలయాల్లో వసతులు కల్పించాలి

## నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

**నిర్మల్, జూలై 14 (ప్రభాత సమాచారం)**



జిల్లాలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో (కేజీబీవీ) మౌలిక వసతులను మెరుగుపర్చేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన సమీక్షా సమావేశం కలెక్టర్ మాట్లాడుతూ, కేజీబీవీ విద్యాలయాల్లో నాణ్యమైన విద్యా బోధనతో పాటు మెరుగైన వసతులు కల్పించేందుకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పైకప్పుల లీకేజీలు, మరమ్మత్తులు, అదనపు మరుగుదొడ్లు, ఫ్లోరింగ్, తలుపులు, కిటికీలు తదితర అంశాలపై తహసీల్దార్లు, ఇంజినీరింగ్ అధికారులు నివేదిక అందజేయాలని సూచించారు. అవసరమైన చోట ఉపాధి హామీ పథకం నిధుల ద్వారా పనులు చేపట్టాలని, దశలవారీగా అభివృద్ధి పనులు పూర్తిచేయాలన్నారు. అనంతరం వైద్యాధికారులతో సమీక్షించిన కలెక్టర్, మండలాలలోని పిహెచ్‌సీలకు అను బంధంగా సబ్ సెంటర్ల నిర్మాణంపై ప్రణాళిక రూపొం దించాలన్నారు. నిర్మాణంలో ఉన్న సబ్ సెంటర్ల పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. పూర్తయిన కేంద్రాలను ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమాలకు ప్రజాప్రతినిధులను ప్రోటోకాల్ ప్రకారం ఆహ్వానించాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, డీఈఓ రామారావు, డీఎంహెచ్ఓ రాజేందర్, కేజీబీవీ సమన్వయకర్త సలోమి కరుణ, తహసీల్దార్లు, ఇంజినీరింగ్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

# సినారె పురస్కారానికి డా॥దామెర రాములు ఎంపిక

**నిర్మల్, జూలై 14 (ప్రభాత సమాచారం)**



మహాకవి సినారె జయంతి సందర్భంగా యాదాద్రి భువనగిరి జిల్లా రచయితల సంఘం ప్రకటించిన పురస్కారాలకు నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన ప్రముఖ వైద్యులు, కవి డాక్టర్ దామెర రాములు ఎంపికయ్యారు. ఈ నెల 27న భువనగిరిలో నిర్వహించనున్న కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర స్థాయి మహాకవి సినారె సాహితి పురస్కారానికి ఉమ్మడి జిల్లాల వారీగా కవులు, రచయితలను ఎంపిక చేశారని పేర్కొన్నారు. ఇందులో ఉమ్మడి ఆదిలాబాద్ నుంచి తనకు స్థానం లభించిందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాకు చెందిన పలువురు కవులు, రచయితలు, కళాకారులు తదితరులు ఆయనను అభినందించారు.



### గ్రామానికి చెందిన గంగపుత్రులకే

# చెరువును కేటాయించాలి

**కాసిపేట, జూలై 14 (ప్రభాత సమాచారం)**

మంచిర్యాల జిల్లా కాసిపేట మండలంలోని ధర్మారావుపేట గ్రామ పంచాయతీలో ఉన్న చెరువును ఇతర గ్రామానికి ఇవ్వకుండా గ్రామ గంగపుత్రులకే అప్పగించాలని ధర్మారావుపేట గంగపుత్రులు కోరారు. గ్రామ గంగపుత్రులు ఎంపీడీవోతో కార్యాలయానికి భారీగా తరలివచ్చి వినతిపత్రం అందజేశారు. ధర్మారావుపేటలో 150 మంది గంగ పుత్రుల కుటుంబాలు గ్రామ చెరువులో చేపలు పెంచి వాటిని విక్రయిస్తూ జీవనాధారం పొందుతున్నామన్నారు. ధర్మారావుపేట గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న చెరువును లంబాడీతండా (డీ) గ్రామ పంచాయతీకి చెందిన కొంత మంది అక్రమంగా ఇతరులకు అప్పగించి, చెరువు వద్దకు గంగపుత్రులను రా కుండా అడ్డుకొని జీవన ఆధారం లేకుండా చేస్తున్నారని మండి పడ్డారు. చెరువు ఆక్రమణకు పాల్పడ్డ వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

# అక్రమ కలప స్వాధీనం

**ఖానాపూర్, జూలై 14 (ప్రభాత సమాచారం)**

ఖానాపూర్ పట్టణంలోని శాంతినగర్ కాలనీలో గల ఒక సంఘ భవనంలో అక్రమంగా నిల్వ ఉంచిన టేకు కర్రను ఫారెస్ట్ సిబ్బంది పట్టుకొని కేసు నమోదు చేశారు. పట్టుకున్న కలపను ఖానాపూర్ ఫారెస్ట్ రేంజ్‌కు తరలించినారు. కర్రను పట్టుకున్న వారిలో ఎఫ్ఎస్ఓలు కుతుబుద్దీన్, కే రత్నయ్య, ఎస్.శ్రీనివాస్ బీట్ ఆఫీసర్‌లు నరేందర్, నారాయణ, నవీన్‌లు ఉన్నారు.



# గుండా మల్లేష్ సేవలు మరువలేనివి

**బెల్లంపల్లి, జూలై 14 (ప్రభాత సమాచారం)**

బెల్లంపల్లి పట్టణంలో సీపీఐ పట్టణ కార్యదర్శి ఆడెపు రాజమౌళి అధ్యక్షతన దివంగత సీపీఐ నేత గుండా మల్లేష్ 79వ జయంతిని వైభవంగా జరిపారు. బెల్లంపల్లి బజార్ ఏరియాలో గుండా మల్లేష్ విగ్రహానికి సీపీఐ నాయకులు పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి మాట్లాడుతూ.. అమరజీవి కామ్రేడ్ గుండా మల్లేష్ ఆశయ సాధన కోసం పట్టణ పార్టీ ఎల్లవేళల కృషి చేస్తుందన్నారు. పట్టణంలో పార్టీ పూర్వ వైభవాన్ని తీసుకురావడానికి అందరూ కృషికి కంకణ బద్దులు కావాలనీ పిలుపునిచ్చారు. తుదిశ్వాస వరకు బడుగు బలహీన పేద వర్గాల ప్రజలు, సింగరేణి కార్మికుల కోసం అలుపెరుగని పోరాటం చేశారని కొనియాడారు. భూమిలేని వారికి భూమి, ఇల్లు లేని వారికి ఇండ్లు పంచారన్నారు. నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిచి అవినీతికి తావు లేకుండా నిస్వార్థంగా ప్రజా శ్రేయసుకు గుండా మల్లేష్ అంకితమై పని చేశారన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో భాగంగా శ్రీకృష్ణ కమిటీ ముందు తెలంగాణ రాష్ట్ర ఆవశ్యకతను సీపీఐ పార్టీ శాసనసభ పక్ష నేతగా తెలంగాణ వాదాన్ని వినిపించారని తెలిపారు. రాష్ట్ర సాధనలో శక్తివంచనలేకుండా పోరాటం చేశారన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చిప్ప నరసయ్య, ఏఐటీయూసీ బెల్లంపల్లి బ్రాంచ్ కార్యదర్శి దాగం మల్లేష్, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు కొంకుల రాజేష్, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు బొల్లం పూర్ణిమ, మహిళా సమాఖ్య



సీనియర్ నాయకురాలు గుండా సరోజ, పట్టణ సహాయ కార్యదర్శి బొల్లం తిలక్ అంబేద్కర్, బి కే ఎం యు జాతీయ సమితి సభ్యులు అక్క పెల్లి బాబు, సీపీఐ బెల్లంపల్లి మండల కార్యదర్శి బొంతుల లక్ష్మీనారాయణ, మహిళా సమైక్య జిల్లా అధ్యక్షురాలు బొల్లం సోని, పట్టణ నాయకులు శంకర్ ,స్వామి దాస్, తిరుమలేష్ గుండ ప్రశాంత్, గుండా శంకర్, సందీప్, కమల, పద్మ తదితరులు పాల్గొన్నారు.

# నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం



- పలు అభివృద్ధి పనులు ప్రారంభం
- మంచిర్యాలకు బస్సు సదుపాయం
- కన్నెపల్లిలో వన మహోత్సవం
- శివ కేశవ ఆలయం ప్రారంభోత్సవం
- బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్



**బెల్లంపల్లి, జూలై 14 (ప్రభాత సమాచారం)**

బెల్లంపల్లి నియోజకవర్గంలో బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి సుడిగాలి పర్యటన చేశారు. భీమిని, కన్నెపల్లి మండలాల్లో నూతనంగా చేపట్టిన పలు అభివృద్ధి పనులను సోమవారం ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి ప్రారంభించారు. తొలుత ఎమ్మెల్యే కన్నెపల్లిలో పర్యటించారు. కన్నెపల్లి చర్లపల్లి ప్రాథమిక పాఠశాలలో నిర్వహిం చిన వన మహోత్సవం కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటారు. భీమిని మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో కూడా వనమోత్సవం కార్యక్రమంలో పాల్గొన్నారు. విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని గుర్తుచేస్తూ, పచ్చదనం పెంపొందించేందుకు మొక్కలు నాటి సంరక్షించాలన్నారు.

**బస్సు సర్వీస్ సేవలు ప్రారంభం..**

భీమిని మండల ప్రజల చిరకాల బస్సు సర్వీస్ సేవల కోరిక తీరింది. భీమిని మండల కేంద్రం నుంచి మంచిర్యాల జిల్లా కేంద్రానికి బస్సు సర్వీస్‌ను ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి ప్రారంభించారు. భీమిని మండల ప్రజలు చిరకాలంగా ఎదురుచూస్తున్న రవాణా సదుపాయం బస్సు ప్రారంభంతో అందుబాటులోకి తెచ్చిన ఘనత బెల్లంపల్లి ఎమ్మెల్యే ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి దక్కిందని ప్రజలు ప్రశంసించారు. భీమిని నుండి మంచిర్యాల జిల్లా కేంద్రానికి బస్సు సర్వీస్ ను ప్రారంభించడం ఎంతగానో సంతోషంగా ఉందనీ ఎమ్మెల్యే తన ఆనందాన్ని వ్యక్తం చేశారు. బస్సు సర్వీస్ తో ప్రజలకు రవాణా సౌకర్యం మెరుగుపడుతుందని పేర్కొన్నారు. భీమిని మండలంలోని జగ్గయ్యపేట గ్రామంలో ఎండోమెంట్ శాఖ ఆధ్వర్యంలో నిర్మించిన శివకేశవ ఆలయాన్ని ఆయన ప్రారంభించారు.

## నారాయణ విద్యాసంస్థపై
# చర్యలు తీసుకోవాలి

**నిర్మల్, జూలై 14 (ప్రభాత సమాచారం)**

నిర్మల్ పట్టణంలోని బైంసా రోడ్‌లో ఉన్న నారాయణ విద్యాసంస్థపై చర్యలు తీసుకోవాలని నిర్మల్ ట్రస్మా ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ఫిర్యాదు చేశారు. నారాయణ విద్యాసంస్థ ఏలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండానే పదో తరగతి వరకు విద్యాబోధన నిర్మించి విద్యార్థులకు పాత తేదీల్లో టీసీలు బోనాఫైలు అందిస్తుందని కలెక్టర్కు ఆర్డిఓకు వివరించారు. గత సంవత్సరం అనుమతి వచ్చినప్పటికీ అంతకుముందు మూడేళ్ల నుంచి తమ పాఠశాలలో చదువుతున్నట్టు పలువురు విద్యార్థులకు ధృవీకరణ పత్రాలు జారీ చేశారని లక్షలాది రూపాయల ఫీజులు వసూలు చేస్తున్నారని ఫిర్యాదులు పేర్కొన్నారు. దీనిపై ఇప్పటికి రెండుసార్లు ఫిర్యాదు చేయడం జరిగిందని విన్నవించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు వెంకటేశ్వరరావు కొత్త కాపు గంగన్న చంద్రప్రకాష్ గౌడ్ పద్మనాభ గౌడ్ సంఘ సభ్యులున్నారు.



## మైనార్టీ గురుకులాలను సందర్శించిన బీఆర్ఎస్ నేతలు




**నిర్మల్, జూలై 14 (ప్రభాత సమాచారం)**

చించోలిలోని తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాలను బీఆర్ఎస్ పార్టీ మైనార్టీ నాయకులు సోమవారం సందర్శించారు. విద్యార్థులకు దుస్తులు, ఆహారం, పుస్తకాల గురించి చర్చించారు. పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు తమ హయాంలో ప్రభుత్వం మైనారిటీ గురుకులాలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఖాజా అక్రమ్ అలీ, మసూద్ అలీ ఖాన్, మహ్మద్ మెహబూబ్, రిజ్వాన్ ఖాన్, వైఎస్ఆర్ కాలనీకి చెందిన ఇమ్రాన్ పాల్గొన్నారు.

# బాధితులకు న్యాయం జరిగేలా చూడాలి

### ఫిర్యాదులు స్వీకరించిన ఎస్పీ కాంతిలాల్ పాటిల్



**ఆసిఫాబాద్, జూలై 14 (ప్రభాత సమాచారం)**

కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం జిల్లా ఎస్.పి. కాంతిలాల్ పాటిల్ ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ఫిర్యాదుదారుల సమస్యలను విని, వాటిని చట్టప్రకారం పరిష్కరించాల్సిందిగా సంబందిత అధికారులకు పలు సూచనలు చేయడమైనది. సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారుల నుండి అర్జీలను స్వీకరించి వాటిని తక్షణ పరిష్కారం కోసం సంబంధిత సర్కిల్ ఇన్స్పెక్టర్ లతో ఫోన్ లో ద్వారా మాట్లాడి సమస్య స్థితిని మరియు పరిష్కారానికి సూచనలు చేయడం జరిగింది. ప్రజలు నిర్భయంగా, మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా ఎలాంటి, పైరవీలు లేకుండా స్వచ్ఛందంగా పోలీసు సేవల్ని వినియోగించుకుంటూ, వారి వారి సమస్యలు చట్ట ప్రకారం పరిష్కరించుకునేల, పోలీసులు ప్రజలకు మరింత దగ్గర య్యేలా, శాంతి భద్రతలు పరిరక్షిస్తూ ముందుకు సాగడమే లక్ష్యంగా జిల్లా పోలీస్ శాఖ పని చేస్తుందని ఎస్పీ కాంతిలాల్ పాటిల్ తెలిపారు. ప్రజా సమస్యలుపై ఫిర్యాదులు నేరుగా స్వీకరిస్తూ ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమం ద్వారా సమస్యలు పరిష్కారిస్తున్నామని, ఎటువంటి ఇబ్బందులు ఉన్నా పోలీసుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.



## విద్యార్థుల్లో సృజనాత్మకతను
# పెంపొందించాలి

**నస్పూర్, జూలై 14 (ప్రభాత సమాచారం)**

మారుతున్న అవసరాలను దృష్టిలో పెట్టుకుని విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించాల్సినవరం ఎంతైనా ఉన్ననది జిల్లా విద్యాధికారి యాదయ్య అన్నారు. నస్పూర్ ప ట్టణంలోని తీగల్ పహాడ్ జిల్లా పరిషత్ పాఠశాలలో సోమవారం పీఎం శ్రీ పాఠశాల భౌతిక, జీవ, గణిత స్కూల్ అసిస్టెంట్స్ ఉపాధ్యా యులకు రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా పాఠశాల అవరణలో మొక్కలను నాటారు. అంతే కాకుండా పాఠశాలలో ఈ విద్యా సంవ త్సరంలో వందవ అడ్మిషన్‌ను తీసుకుకోవడానికి వచ్చిన విద్యార్థికి డీఈ వో యాదయ్య సమక్షంలో అడ్మిషన్ పొందాడు. అనంతరం డీఈవో మాట్లాడుతూ నూతన సైన్స్ పరికరాలను విద్యార్థులు వినియోగిం చు కునే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమాల్లో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వామన్ రావు, సెక్టోరయల్ అధికారులు సత్యనారాయణ మూర్తి, విజయలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# కలప దుంగల స్వాధీనం

**కడెం, జూలై 14 (ప్రభాత సమాచారం)**

కడెం మండలంలోని నవాబుపేట గ్రామ శివారులో అక్రమంగా దాచి ఉంచిన కల్ప దుంగలను శాఖ అధికారులు స్వాధీన పరుచుకున్నారు. అటవీ శాఖకు చెందిన కింగ్ ఫిషర్ మనోద్దీన్లకు అందిన పక్కా సమాచారం మేరకు అధికారులు ఆకస్మాత్తుగా దాడులు చేశారు. దాచి ఉంచిన దొంగల విలువను ఇంకా లెక్కించలేదని ఈ ఘటనపై కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నామన్నారు. పూర్తి వివరాలు వెల్లడిస్తామన్నారు.



# జీవో 49 రద్దు చేయాలని ఆదివాసీ సంఘాల ధర్నా

**కెరమెరి, జూలై 14 (ప్రభాత సమాచారం)**

కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లాలో టైగర్ కన్జర్వేషన్ రిజర్వ్ పేరుతో ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో నంబర్ 49ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఆదివాసి సంఘాల నాయకులు సోమవారం ఫారెస్టు కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించిన అనంతరం ఎఫ్ఆర్వో మజారోద్ది న్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆదివాసీ సంఘాల నాయకులు మాట్లాడుతూ జీవో నంబర్ 49 ద్వారా ఆదివాసీ గ్రామాలు కనుమరుగవు తాయని అడవిని నమ్ముకుని జీవిస్తున్న ఆదివాసీలకు తీవ్రఅన్యాయం జరుగుతుందన్నారు. ప్రభుత్వం వెంటనే జీవోను రద్దుచేయాలని లేని పక్షంలో అందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు కోవ విజ య్‌కుమార్, ఆదివాసి సంఘాల నాయకులు భరత్ భూషన్, రాజేశ్వర్, ప్రభాకర్, జంగు పాల్గొన్నారు. వాంకిడి మండలంలో జీవో నంబరు 49ని వెంటనే రద్దు చేయాలని తుడుం దెబ్బ జిల్లా అధ్యక్షుడు కోవా విజయ్ కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని తహసీల్ కార్యాల యం ఎదుట తుడుం దెబ్బ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం తహసీల్దార్ కవిత, ఆటవీశాఖ సెక్షన్ అధికారికి వినతిపత్రాలు అందజేశా రు. కార్యక్రమంలో తుడుం దెబ్బ నాయకులు కీనక ప్రభాకర్, పెందుర్ మారుతి, కోట్నక రాంషా, కినక రాము, సోయం సంజీవ్, వుయికే రాము, మడావి భీంరావు, సీడాం పగ్గు వివిధ గ్రామాల నుంచి వచ్చిన ఆదివాసీలు పాల్గొన్నారు. జైనూర్ మండలంలో ఆదివాసులను అడవీ నుంచి దూరం చే యాలనే ఉద్దేశంతో ప్రభుత్వం అమలు చేయనున్న జీవో 49ను వెంటనే రద్దు చేయాలని ఆదివాసీ సంఘాల నాయకులు కుంర శాంరావ్, పేసా చట్టం మొబలైజర్ కుంర విష్ణు డిమాండ్ చేశారు.కార్యక్రమంలో మండల ఇన్‌చార్జి జుగునాక శంకర్ తదిత రులు పాల్గొన్నారు. సిర్పూరు(టి) మండలంలో రాష్ట్ర ప్రభు త్వం విడుదల చేసినజీవో 49ను వెంటనే రద్దు చేయాలని తహసీల్దార్ మహ్మద్ రహీమోద్దీన్‌కు ఆదివాసీ సంఘాల నాయకులు గంట గోపాల్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు.



### ప్రజావాణి దరఖాస్తులను క్షేత్రస్థాయిలో

# పరిశీలించి త్వరగా పరిష్కరించాలి

**అధికారులు అర్జీదారుల పట్ల మర్యాదగా వ్యవహరించాలి - మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్**



**మంచిర్యాల, జూలై 14 (ప్రభాత సమాచారం)**

ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను సంబంధిత అధికారుల సమన్వయంతో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో మంచిర్యాల, బెల్లంపల్లి రాజస్వ మండల అధికారులు శ్రీనివాస్ రావు, హరికృష్ణ లతో కలిసి అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. జైపూర్ మండలం టేకుమట్ల గ్రామానికి చెందిన జి.నాగరాజు తన కుటుంబ సభ్యులతో కలిసి తమ తాతల నుండి వారసత్వంగా వస్తున్న భూమి వివరాలు రెవెన్యూ రికార్డులలో తప్పుగా నమోదు చేయడం జరిగిందని, సవరించి తమకు న్యాయం చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. నెన్నెల మండలం జంగాల్పేట్ గ్రామానికి చెందిన మరుశెట్టి లక్ష్మయ్య తమకు చెందిన పట్టా భూమిని ఎలాంటి సమాచారం లేకుండా ఇతరులు పట్టా చేసుకున్నారని, ఈ విషయమై సమగ్ర విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. మంచిర్యాల పట్టణానికి చెందిన మత్స్యకారులు తమ దరఖాస్తులో మత్స్య పారిశ్రామిక సహకార సంఘంలో సభ్యత్వం పొంది చెరువులలో చేపలు పట్టే వారు లైసెన్స్ పొంది గోదావరి నదిలో చేపలు పట్టడం వలన తాము నష్టపోతున్నామని, అట్టి లైసెన్స్‌ను రద్దు పరిచి తమను ఆదుకోవాలని కోరారు. మందమర్రి మండలం చిర్రకుంట గ్రామానికి చెందిన దుర్గం ప్రమీల నిరుపేద అయిన తనకు ఇందిరమ్మ ఇండ్ల పథకం మొదటి విడతలో ఇల్లు మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. బెల్లంపల్లి మండలం పెద్దనపల్లి గ్రామంలోని 10వ వార్డు మాజీ కౌన్సిలర్ కొక్కెర చంద్రశేఖర్ తమ వార్డులో గతంలో అంగన్వాడీ కేంద్రం ఉండేదని, గ్రామాల విభజన సమయంలో తీసివేశారని, తిరిగి ఏర్పాటు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. ఆదివాసీ నాయకపోడు హక్కుల పరిరక్షణ కమిటీ ప్రతినిధులు తమ దరఖాస్తులో అడవికి ఆదావాసీలను దూరం చేసే జీ.ఓ. నం. 49ను రద్దు చేయాలని కోరారు. ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం ప్రతినిధులు జిల్లాలో నెలకొన్న విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని, పోస్టులను భర్తీ చేయాలని, అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న జూనియర్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని తెలిపారు. మందమర్రి మండలం క్యాతనపల్లి గ్రామానికి చెందిన మాజీ ఎం.పి.టి.సి. గోపు రాజం మండల తహశిల్దార్ కార్యాలయం శిథిలావస్థలో ఉందని, వర్షం పడితే రెవెన్యూ రికార్డులు పాడయ్యే ప్రమాదం ఉందని, ఈ విషయమై తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరుతూ అర్జీ సమర్పించారు. పెద్దపల్లి జిల్లా రామగుండం మండలం గోదావరిఖనికి చెందిన ముదుతనపెల్లి సారయ్య తనకు జిల్లాలోని కన్నెపల్లి మండలం కొత్తపల్లి గ్రామ శివారులో గల భూమి నిషేధిత జాబితాలో చూపుతుందని, తొలగించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో 39 దరఖాస్తులు అందాయని, ప్రతి దరఖాస్తును క్షేత్రస్థాయిలో పరిశీలించి సంబంధిత అధికారుల సమన్వయంతో అర్జీల పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



---



### స్వచ్ఛత పక్వాడా పక్షోత్సవాల్లో భాగంగా

## చిత్రలేఖనం పోటీలు

**తాండూర్, జూలై 14 (ప్రభాత సమాచారం)**

మండల కేంద్రంలోని విద్యాభారతి పాఠశాలలో సోమవారం భారత పెట్రోలియం సంస్థ ఆధ్వర్యంలో స్వచ్ఛ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు. భారత పెట్రోలియం సేల్స్ ఆఫీసర్ నాగరాజు మాట్లాడుతూ స్వచ్ఛత పక్వాడా పక్షోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు శుభ్రత, పరిశుభ్రతతో పాటు పలు అంశాల్లో పిల్లలకు పోటీలు నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణ కోసం భావితరాలకు ఉపయోగపడే విధంగా మొక్కల పెంపకం వాటిని సంరక్షించే విధానం తదితర అంశాల గురించి చిన్నారులకు వివరించారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సేల్స్ మేనేజర్ ప్రశాంత్ , పాఠశాల కరస్పాండెంట్ సురభి శరత్ కుమార్, ప్రిన్సిపాల్ సరోజరాణి, విద్యార్థులు పాల్గొన్నారు.

## స్నేహితుడి కంటి ఆపరేషన్‌కు ఆర్థిక సాయం అందజేత



**తాండూర్, జూలై 14 (ప్రభాత సమాచారం)**

చిన్నతనం నుంచే కంటిచూపుతో ఇబ్బంది పడుతున్న ఓ స్నేహితుడికి ఆపన్నహస్తం అందించారు. మంచిర్యాల జిల్లా తాండూర్ మండలం మాదారం టౌన్‌షిప్‌నకు చెందిన అన్నం దాసరి చంద్రయ్య చిన్నప్పటి నుంచే కంటిచూపుతో ఇబ్బందులు పడుతున్నాడు. చికిత్స కోసం అనేక ఆసుపత్రులు తిరిగినా ఇప్పటివరకు కంటి చూపు మెరుగు కాలేదు. చివరిసారిగా ఎల్వీ ప్రసాద్ ఐ హాస్పిటల్ హైదరాబాదులో టెస్ట్ చేయించుకోగా ఆరోగ్యశ్రీలో కొంతవరకే వర్తిస్తుందని, మిగతా డబ్బులు సొంతగా భరించాలని సూచించారు. దీంతో ఇప్పటికే ఆర్థిక ఇబ్బందులతో సతమవుతున్న చంద్రయ్య 1989-1990 బ్యాచ్‌కు చెందిన తోటి స్నేహితుల సాయం కోరాడు. వారు స్పందించి 30 వేల రూపాయలు జమచేసి వారికి అందించి అండగా నిలిచారు. బాధితుడి కుటుంబ సభ్యులు మాట్లాడుతూ దాదాపు 25 సంవత్సరాల తరువాత నాటి స్నేహితుడిని గుర్తించుకుని సాయం చేయడం గొప్ప విషయమని పలువురు ఈ సందర్భంగా కొనియాడారు.

## ఎల్లంపల్లి ముంపు బాధితుల బకాయిలు చెల్లించాలి



**హాజీపూర్, జూలై 14 (ప్రభాత సమాచారం)**

హాజీపూర్, లక్సెట్టిపేట మండలాల్లో ఎల్లంపల్లి ప్రాజెక్ట్ ముంపు బాధితులకు పెండింగ్‌లో ఉన్న బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ బీజేపీ నాయకులు రఘునాథ్ వెరబెల్లి తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ముంపు ప్రాంత బాధితులతో కలిసి అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి పాదయాత్ర నిర్వహించారు. ఎమ్మెల్యేగా గెలిచిన వంద రోజుల్లో నష్ట పరిహారం ఇప్పిస్తానని హామీ ఇచ్చిన ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు 18 నెలలు గడిచిన ఇప్పటి వరకు బాధితులకు న్యాయం చేయలేదన్నారు. ఎల్లంపల్లి ప్రాజెక్ట్ ముంపు బాధితులకు పరిహారం చెల్లించే వరకు బీజేపీ పోరాటం ఆగదని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎల్లంపల్లి ముంపు గ్రామాల ప్రజలు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.



### బీసీ బాలికల పోస్ట్ మెట్రిక్

## వసతి గృహాన్ని ప్రారంభించాలి

**ఆసిఫాబాద్, జూలై 14 (ప్రభాత సమాచారం)**

జిల్లా కేంద్రంలోని పాత కలెక్టరేట్ ఎదురుగా నిర్మిస్తున్న బీసీ బాలికల పోస్ట్ మెట్రిక్ వసతి గృహం పనులను వేగవంతం చేసి త్వరగా ప్రారంభించాలని కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్ డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టర్ వెంకటేష్ దోత్రేకు వినతి పత్రం అందజేయడంతో బీసీ సంక్షేమ శాఖ అధికారిని భవన పనులపై పూర్తి నివేదిక తయారు చేసి అందించాలని కలెక్టర్ ఆదేశించారు. అనంతరం దినకర్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వం 2.9 కోట్ల రూపాయలతో భవనం నిర్మాణం చేపట్టగా చివరి దశకు చేరుకున్నాయని ఫ్లోరింగ్, ప్లంబింగ్, విద్యుత్ పనులు మిగిలి ఉన్నాయని వాటిని వెంటనే పూర్తిచేసి జనకాపూర్‌లో అద్దె భవనంలో కొనసాగుతున్న బీసీ బాలికల పోస్ట్మెట్రిక్ వసతి గృహాన్ని వెంటనే తరలించాలన్నారు.

### యువత చెడు అలవాట్లకు

## దూరంగా ఉండాలి

**జైనూర్, జూలై 14 (ప్రభాత సమాచారం)**

డ్రగ్స్ తీసుకుంటే ఆరోగ్యాలు, జీవితాలు నాశనమవుతాయని, యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని జైనూర్ సిఐ రమేష్ సూచించారు. సోమవారం సాయంత్రం జైనూర్ మండలంలోని రాసిమెట్ట, బుసిమెట్ట ఆశ్రమ పాఠశాలలో పోలీస్ మిత్ర కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు, యువకులకు మాదకద్రవ్యాలతో కలిగే దుష్ప్రభావాలపై అవగాహన కల్పించారు. యువకులు మంచి ప్రవర్తన కలిగి ఉండాలని, చెడు వ్యసనాలకు బానిసలుగా మారొద్దని సూచించారు. బాగా చదువుకొని ఉన్నతస్థాయి చేరుకోవాలన్నారు.



# ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న దిష్టిబొమ్మ దహనం



**బెల్లంపల్లి, జూలై 14 (ప్రభాత సమాచారం)**

తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్సీ తీర్మార్ మల్లన్న దిష్టిబొమ్మను సోమవారం రాత్రి బెల్లంపల్లిలో తెలంగాణ జాగృతి శ్రేణులు దహనం చేశారు. కవితపై అనుచిత వ్యాఖ్యలు చేసిన తీన్మార్ మల్లన్నపై చర్య తీసుకోవాలని పట్టణంలోని కాంటా అంబేద్కర్ చౌరస్తా వద్ద తీన్మార్ మల్లన్న దిష్టిబొమ్మ దహనం చేసి నిరసన తెలిపారు. మల్లన్నకు వ్యతిరేకంగా తెలంగాణ జాగృతి నాయకులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. మరో సారి మల్లన్న తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే తగిన మూల్యం చెల్లించుకోకతప్పదన్నారు. ఈ కార్యక్ర మంలో తెలంగాణ జాగృతి జిల్లా ప్రతినిధులు ఈట రాకేష్, నియోజకవర్గ అధ్యక్షులు పుల్లూరి మౌనిక్, రెడ్డవేణ శ్రీనాథ్, కందుల స్వరాజ్, బండారి రేవంత్, సళ్ళ సాయి, సల్మాన్, మహంతి, నితిన్, గౌతమ్, ఆశిష్, కుషాల్, డన్ను, బబ్లూ, బీఆర్ఎస్వీ టౌన్ అధ్యక్షుడు ఆడేపు అరుణ్, చరణ్, నాగసాయి, రోహిత్, అభిలాష్ పాల్గొన్నారు.

# తెలంగాణ రైతాంగంపై బీజేపీ వివక్ష : పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ

**మంచిర్యాల, జూలై 14 (ప్రభాత సమాచారం)**

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాష్ట్రానికి యూరియా కోటా తగ్గించి కక్ష సాధింపులకు పాల్పడుతుందని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ ఆరోపించారు. సోమవారం రామగుండం ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్(ఆర్ఎఫ్‌సీఎల్)ను సందర్శించిన ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆర్ఎఫ్‌సీఎల్ ఏర్పాటు చేస్తే ఈ ప్రాంత యువతకు ఉపాధి లభిస్తుందని, రైతాంగానికి ఎరువులు అందుబాటులో ఉంటాయని ప్రజలు భావించారన్నారు. మన్మోహన్ సింగ్ సారధ్యంలోని యూపీఏ ప్రభుత్వం ఎఫ్‌సీఐ పునరుద్ధరణకు అన్నీ చర్యలు చేపట్టిందన్నారు. ఈ ప్రాంత ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడ్డా ఆర్ఎఫ్‌సీఎల్ నిర్మాణాన్ని స్వాగతించారన్నారు. కానీ ఇప్పుడు బీజేపీ ప్రభుత్వం బీజేపీ పాలిత రాష్ట్రాలకు అధిక యూరియా కేటా



యించి తెలంగాణపై వివక్ష చూపుతుందన్నారు. రాష్ట్ర రైతాంగాన్ని ఇబ్బందులు పెడుతున్న బీజేపీ వైఖరిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. గత సంవత్సరం కంటే ఆర్ఎఫ్‌సీఎల్ నుంచి 1.14లక్షల టన్నులు తక్కువ కేటాయించారని, జూలై కోటాలోనే 30వేల టన్నులు తగ్గించారన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర ఎరువుల శాఖ మంత్రి, బీజేపీ జాతీయ అధ్యక్షుడు నడ్డాను కలిసి విజ్ఞప్తి చేసినా సరఫరా పెరగలేదన్నారు. వరి నాట్ల సీజన్ మొదలైందని, పది రోజుల్లో యూరియా వినియోగం ఎక్కువగా ఉంటుందన్నారు. ఈలోపే కేంద్రం యూరియాను సరఫరా చేయాలని కోరారు. తాను కూడా కేంద్ర మంత్రిని కలిసి రైతాంగం ఇబ్బందుల గురించి వివరిస్తానన్నారు. పార్లమెంట్ సమావేశాల్లో సైతం ఆర్ఎఫ్‌సీఎల్ నుంచి యూరియా కేటాయించకపోవడాన్ని లేవనెత్తుతామన్నారు. తెలంగాణ రైతుల పట్ల కేంద్ర ప్రభుత్వం వైఖరి సరికాదని ఆయన అన్నారు. కాంగ్రెస్ నాయకులు గుమ్మడి కుమారస్వామి, మల్లికార్జున్, తొగరి తిరుపతి, కామ విజయ్, జీన్స్, నర్సింగ్‌దొర తదితరులు ఉన్నారు.



### ట్రిపుల్ ఐటీలో సీటు సాధించిన

## విద్యార్థులకు సన్మానం

**తాండూర్, జూలై 14 (ప్రభాత సమాచారం)**

ట్రిపుల్ ఐటీలో సీటు సాధించిన మండలంలోని అచ్చలాపూర్ జడ్పీహెచ్ఎస్ పాఠశాల విద్యార్థులు పుప్పాల పూజిత, సముద్రాల జస్వంత్‌ను పాఠశాల ఉపాధ్యాయులు సోమవారం సన్మానించారు. పాఠశాలలో శాలువాలతో ఘనంగా సన్మానించారు. 2024- 2025 సంవత్సరం పదవ తరగతి ఫలితాలలో ప్రథమ స్థానం సాధించిన విద్యార్థిని పుప్పాల పూజితకు సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు కే శ్రీనివాస్ రూ. 10వేల ప్రైజ్ మనీ అందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు ఉమాదేవి, సన్మాన గ్రహీతలు, పాఠశాల ఉపాధ్యాయులు తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### ఓటరు జాబితాను తప్పులు

## దొర్లకుండా తయారు చేయాలి

### కుభీర్ తహసీల్దార్ శివరాజ్



**కుభీర్, జూలై 14 (ప్రభాత సమాచారం)**

ఓటరు జాబితాను తప్పులు దొర్లకుండా పారదర్శకంగా తయారు చేయాల్సిన బాధ్యత బిఎల్వోలదేనని తహసీల్దార్ శివరాజ్ సూచించారు. సోమవారం మండల కేంద్రం కుభీర్ లోని రైతు వేదికలో మండలంలోని ఆయా గ్రామాల బిఎల్వోలు సూపర్వైజర్లతో నిర్వహించిన శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాస్టర్ ట్రైనర్స్ జిలకర రాజేశ్వర్, గంగాధర్ ఓటరు జాబితాలో తప్పుల సవరణ, ఎన్నికల విధులు, బాధ్యతలు, ఎన్నికలకు సంబంధించిన వివిధ అంశాలపై వారు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీటీలు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

### అపరిశుభ్రంగా డబుల్ బెడ్ రూమ్

## ఇండ్ల సముదాయం

**నిర్మల్, జూలై 14 (ప్రభాత సమాచారం)**

ఎల్లపల్లి డబుల్ బెడ్ రూమ్ సముదాయం పరిసరాలు దుర్గంధ భరితంగా మారాయని ఏఐఎంఐఎం మాజీ కౌన్సిలర్లు మహమ్మద్ ముజాహిద్ రఫీ అహ్మద్ ఖురేషిలు పేర్కొన్నారు. ఇప్పటికే ఈ విషయమై సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లిన ఫలితం లేదన్నారు. 465 పైగా కుటుంబాలు నివాసం ఉంటున్న ఈ సముదాయంలో పారిశుద్ధ్య సమస్యల కారణంగా ప్రజలు రోగాల బారిన పడుతున్నారు అన్నారు. ఇందులో నాయకులు మొహమ్మద్ ఇర్ఫాన్, అమన్ ఖాన్‌లున్నారు.



### 49 జీవోతో ఆదివాసుల

## అణిచివేతకు ప్రభుత్వం కుట్ర



**నార్నూర్, జూలై 14 (ప్రభాత సమాచారం)**

49 జీవో నెంబర్‌ను రద్దు చేయాలని ఆదివాసి హక్కుల పోరాట సమితి తుడుం దెబ్బ జిల్లా అధ్యక్షుడు పేందూర్ దాదిరావు డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దార్ జాడీ రాజాలింగంకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసి చట్టాలను అమలు చేయాల్సింది పోయి కొత్త జీవోలతో ఆదివాసులను అణచివేతకు రాష్ట్ర ప్రభుత్వం, అటవీ శాఖ అధికారులు పూనుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 49 జీవో తో ఆదివాసి గ్రామాలను ఖాళీ చేయాలని, ఖనిజ సంపదను దోచుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం చూస్తుందని ఆరోపించారు. ఈ జీవో నెంబర్‌ను రద్దు చేయాలంటూ జిల్లా వ్యాప్తంగా గ్రామ సభల ద్వారా తీర్మానాలు చేశామన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు మానిక్ రావు, మండల అధ్యక్షుడు ఆడ శ్రీరామ్. కార్యనిర్వహణ అధ్యక్షుడు మడవి సాగర్, నాయకులు మెస్రం మోతీరామ్, రమేష్, జంగు తెలంగ్ రావు, యశ్వంత్ తదితరులున్నారు.

### వైద్య శిబిరాలను గ్రామస్థులు

## సద్వినియోగం చేసుకోవాలి

**గాదిగూడ, జూలై 14 (ప్రభాత సమాచారం)**

ఉచితంగా గ్రామాల్లో నిర్వహిస్తున్న వైద్య శిబిరాలను గ్రామస్థులు సద్వినియోగం చేసుకోవాలని హెల్త్ ఎడ్యుకేటర్ రాథోడ్ రవీందర్ కోరారు. ఆదిలాబాద్ జిల్లా గాదిగూడ మండలం అర్జుని గ్రామపంచాయతీ పరిధిలోని కొలాం గూడలో ఝరి ప్రభుత్వ ఆసుపత్రి వైద్య సిబ్బంది సోమవారం వైద్య శిబిరాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా స్థానికులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఎడ్యుకేటర్ మాట్లాడుతూ వైద్య శిబిరంలో వైద్య నిపుణులతో వివిధ రకాల వైద్య సేవలు అందించనున్నట్లు తెలిపారు. వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని, వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది జంగుబాయి, సావిత్రిబాయి, గ్రామస్థులు పాల్గొన్నారు.





## అవార్డు గ్రహీతకు సన్మానం

**మందమర్రి, జూలై 14 (ప్రభాత సమాచారం)**

ఏరియాలోని కాసీపేట-1 గనిలో హెడ్ ఓవర్ మెన్ గా విధులు నిర్వహిస్తున్న నెల్లి సదయ్య జాతీయ అవార్డ్ కు ఎంపికయ్యారు. తెలుగు సంస్కృతి సాహితీ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో వరంగల్ లో నిర్వహించిన కార్యక్రమంలో జాతీయ పురస్కారం అందుకున్న సదయ్యను సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. సోమవారం కాసీపేట-1 గనిపై యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయనను ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా యూనియన్ బ్రాంచ్ అధ్యక్షుడు ఎస్ వెంకట స్వామి, ఏఐసిడబ్ల్యుఎఫ్ జాతీయ కార్యదర్శి అల్లి రాజేందర్ లు హాజరై మాట్లాడారు. సదయ్య సామాజిక సేవ కార్యక్రమాలలో తన వంతు కృషిగా తనకు తోచిన సహాయం చేయాలనే భావన కలిగిన వ్యక్తి అని, కష్టం వచ్చిన వారిని ఆదుకునే మనస్తత్వం కలవాడని కొనియాడారు. కరోనా సమయంలో ప్రజలకు సహాయ సహకారాలు అందించారని గుర్తు చేశారు. అదేవిధంగా ఇటీవల ఎస్ఎల్బీసీ శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ కెనాల్ టన్నెల్ లో చిక్కుకుపోయిన కార్మికులను కాపాడుట కొరకు సింగరేణి రెస్క్యూ ఆధ్వర్యంలో నెలరోజులపాటు తన సేవలు అందించారని తెలిపారు. రాబోయే రోజుల్లో ఆయన మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ గని అసిస్టెంట్ పిట్ కార్యదర్శి నాగవెల్లి శ్రీధర్, నాయకులు ప్రశాంత్, రమేష్, అలవాల సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

### బీసీ ఉద్యోగుల

## సంక్షేమానికి కృషి చేస్తా

**నిర్మల్, జూలై 14 (ప్రభాత సమాచారం)**



తెలంగాణ రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మినిస్ట్రియల్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులుగా నిర్మల్ బీసీ సంక్షేమ శాఖ అడ్మినిస్ట్రేషన్ అధికారి కాలిక్ అహ్మద్ నియమితులయ్యారు. హైదరాబాద్‌లోని బీసీ భవన్‌లో రాష్ట్ర కార్యవర్గ సమావేశం సోమవారం నిర్వహించగా రాష్ట్ర కమిటీని ప్రకటించగా నిర్మల్ జిల్లాకు చెందిన ఎంఏ కాలిక్‌కు రాష్ట్ర ఉపాధ్యక్షుడు వరించింది. బీసీ ఉద్యోగుల సంక్షేమానికి కృషి చేస్తానన్నారు. ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన ఆయనకు జిల్లా అధికారి శ్రీనివాస్ సంక్షేమ శాఖ ఉద్యోగులు సత్యనారాయణ రెడ్డి, రవి, అభినందనలు తెలిపారు.

### మాదక ద్రవ్యాల నియంత్రణలో

## విద్యార్థులు కీలకపాత్ర పోషించాలి





**కెరమెరి, జూలై 14 (ప్రభాత సమాచారం)**

మాదక ద్రవ్యాలు నియంత్రించడంలో పాఠశాల, కళాశాల విద్యార్థులు ముఖ్యపాత్ర పోషించాలని ఎస్పీ కాంతిలాల్ పాటిల్ సూచించారు. మాదక ద్రవ్యాల నియంత్రణలో భాగంగా పోలీసుశాఖ ఆధ్వర్యంలో సోమవారం కెరమెరి మండంలోని మోడి ఆశ్రమ పాఠశాలలో నిర్వహించిన అవగాహన కార్య క్రమానికి అయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మాదకద్రవ్యాలు వ్యక్తిగత జీవితాన్ని కుటుంబాన్ని, భవిష్యత్‌ను నాశనం చేస్తాయన్నారు. విద్యార్థులు, యువత మాదకద్రవ్యాల వలలో చిక్కు కొకుండా జాగ్రత్త పడాలని సూచించారు. విద్యార్థులు తమ లక్ష్యాలను ఎంచుకొని క్రమశిక్షణతో ముందుకు సాగాలన్నారు. పోలీసుశాఖ ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల వినియోగం వాటి ప్రభావంపై విద్యార్థు లకు విస్తృత అవగాహన కల్పిస్తున్నామన్నామన్నారు. విద్యార్థినులు ర్యాగింగ్, ఈవ్ టిజింగ్, సైబర్ క్రైం నేరాలకు గురైతే వెంటనే పోలీసులను సంప్రదించాలని సూచించారు. డ్రగ్స్ గురించి ఎలాంటి విషయమైన విద్యార్థులకు తెలిస్తే వెంటనే 1908, 8712670551 నంబర్లకు ఫోన్ చేసి తెలపాలని కోరారు. అనంతరం విద్యార్థులతో మాదక ద్రవ్యాల నియంత్రణ గురించి ప్రతిజ్ఞ చేయించి పాఠశాల అవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో సీఐ సత్యనారయణ, ఎస్సై మధుకర్, ఎంఈవో ప్రకాష్, మాజీ జడ్పీటీసీ లక్ష్మణ్, ప్రేందాస్, ఎస్సీఆర్పీ శ్యాంరావు తదితరులు పాల్గొన్నారు.



# అర్జీలు స్వీకరించి.. భరోసా కల్పించి

- ప్రజావాణిలో దరఖాస్తులను స్వీకరించిన కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే
- అర్జీదారులను పదేపదే ఇబ్బందిపెట్టొద్దు..
- సమస్యలను త్వరగా పరిష్కరించాలని ఆదేశం
- ఇతర రోజులు అర్జీలు సమర్పించవచ్చు..

**ఆసిఫాబాద్, జూలై 14 (ప్రభాత సమాచారం)**

ప్రజావాణి కార్యక్రమంలో అందిన ధరఖాస్తులను త్వరగా పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ డేవిడ్, ఆర్డీవో లోకేశ్వర్‌రావులతో కలిసి అర్జీదారుల నుంచి దరఖాస్తు లు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడు తూ ప్రజావాణి కార్యక్రమంలో అందిన ప్రతీ దరఖాస్తు లను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కలెక్టరేట్‌లో గ్రీవెన్స్‌సెల్ ప్రారంభించడం జరిగిందని ఇతర రోజుల్లో గ్రీవెన్స్‌సెల్‌లో అర్జీలు సమర్పించవచ్చని తెలిపారు. నిర్ణీత గడువులోగా దరఖాస్తులను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటా మన్నారు. కార్యక్రమంలో అయా శాఖల అధికారులు పాల్గొన్నారు. జైనూరు మండలం జంగాం గ్రామానికి చెందిన కోవ దాదారావు తన తండ్రి కౌలుకు ఇచ్చిన భూమిని తిరిగి ఇవ్వమంటే బెదిరింపులకు గురిచేస్తున్నారని ఈ విషయమై చర్యలు తీసుకొవాలని అర్జీ సమర్పించారు. ఆసిఫాబాద్ పట్టణం రవిచంద్రకాలనీకి చెందిన లలిత, ఆసిఫాబాద్ మండలం గోవింద్‌పూర్ గ్రామానికి చెందిన వైరగాడే జాగ్రుబాయి తమకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. కాగజ్‌నగర్ మండలం నజ్రూల్‌నగర్‌కు చెందిన కవిత మండల్ తమ భూమి ఇతరులు అక్రమంగా కబ్జా చేసినందున తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. కెరమెరి మండలం కరంజివాడకు చెందిన కుమ రం లక్ష్మిబాయి తనకు జారీ చేసిన ఆర్ఓఎఫ్ఆర్ పట్టా లో ఇతరుల ఆధార్ నంబరు నమోదు కావడంవల్ల ప్ర భుత్వ రాయితీలు రావడంలేదని సవరించాలని కోరారు. బెజ్జూరు మండలం సోమిని గ్రామా నికి చెందిన గిరిజనులు తమకు ప్రధాన మంత్రి అవాస్ యోజన కింద ఇల్లు మం జూరు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. బెజ్జూరు మండలం మర్తిడి గ్రామానికి చెందిన ఈశ్వరయ్య 30 ఏళ్ల క్రితం కొనుగోలు చేసిన భూమికి పట్టా మం జూరు చేసి పాస్‌పుస్తకం జారీ చేయాలని అర్జీ సమర్పించారు. జిల్లా కేంద్రంలోని పాత కలెక్టరేట్ ఎదురుగా నిర్మిస్తున్న బీసీ బాలికల పోస్ట్ మెట్రిక్ వసతి గృహం పనులను వేగవంతం చేసి త్వరగా ప్రారంభించాలని కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్ కలెక్టర్ వెంకటేష్ దోత్రేకు వినతి పత్రం అందజేయడంతో బీసీ సంక్షేమ శాఖ అధికారిని భవన పనులపై పూర్తి నివేదిక తయారు చేసి అందించాలని కలెక్టర్ ఆదేశించారు. అనంతరం దినకర్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వం 2.9 కోట్ల రూపాయలతో భవనం నిర్మాణం చేపట్టగా చివరి దశకు చేరుకున్నాయని ఫ్లోరింగ్, ప్లంబింగ్, విద్యుత్ పనులు మిగిలి ఉన్నాయని వాటిని వెంటనే పూర్తిచేసి జనకాపూర్‌లో అద్దె భవనంలో కొనసాగుతున్న బీసీ బాలికల పోస్ట్మెట్రిక్ వసతి గృహాన్ని వెంటనే తరలించాలన్నారు. ఆసిఫాబాద్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల భూమి ఆక్రమణలకు గురి కాకుండా కాపాడాలని కళాశాలకు ప్రహరీ నిర్మించాలని, రోడ్డు సౌకర్యం కల్పించాలని కోరుతూ పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతి అర్జీ సమర్పించారు. సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ, డీవైఎ ఫ్ఐ, టీఏజీఎస్‌ల ఆధ్వర్యంలో కలెక్టర్‌కు అర్జీ సమర్పించారు.



# ఎన్నికలలో మార్గదర్శకాల ప్రకారమే అధికారులు విధులు నిర్వహించాలి

**కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే**



**ఆసిఫాబాద్, జూలై 14 (ప్రభాత సమాచారం)**

స్థానిక సంస్థల ఎన్నికలలో అధికారులు మార్గదర్శకాలు ప్రకారం విధులు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారితో కలిసి మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, మండల పంచాయతీ అధికారులతో స్థానిక సంస్థల ఎన్నికల మార్గదర్శకాలు, నిబంధనలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల సంఘం స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై జిల్లా పంచాయతీ అధికారి, మండల పరిషత్ అభివృద్ధి అధికారులకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శిక్షణ ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఎన్నికల నిర్వహణలో ఎలాంటి తప్పులకు తావు లేకుండా విధులు నిర్వహించాలని, పోలింగ్ కేంద్రాల గుర్తింపు, ఓటరు జాబితా రూపకల్పన, పోలింగ్ కేంద్రాలలో ఏర్పాట్లు, పోలింగ్ నిర్వహణకు అధికారులు, సిబ్బంది నియామకం కొరకు జాబితా రూపొందించాలని, ఎన్నికల మార్గదర్శకాలను పూర్తిగా తెలుసుకోవాలని తెలిపారు. ఎన్నికలు నిర్వహించే సిబ్బందికి తగిన శిక్షణ ఇవ్వాలని తెలిపారు. గ్రామాలలో పారిశుధ్యంపై సమీక్షలు నిర్వహించాలని, వర్షాకాలంలో దోమల వృద్ధిని నియంత్రించేందుకు దోమల మందు, ఆయిల్ బాల్స్, బ్లీచింగ్ పౌడర్ పిచికారి చేయాలని తెలిపారు. భారీ వర్షాలు కారణంగా వాగులు పొంగిన సమయంలో అటువైపుగా ప్రజలు వెళ్లకుండా బందోబస్తు ఏర్పాటు చేయాలని, నిరాశ్రయాలకు పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసిన కల్పించాలన్నారు. వనమహోత్సవం కార్యక్రమంలో జిల్లాకు కేటాయించిన లక్ష్యాలను త్వరగా పూర్తిచేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి బిక్షపతి, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి దత్తారావు, జిల్లా పరిషత్ కార్యనిర్వాహక అధికారి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.



## గంజాయి సాగు చేసిన వ్యక్తికి
# రెండు సంవత్సరాలు జైలు

**ఆసిఫాబాద్, జూలై 14 (ప్రభాత సమాచారం)**

గంజాయి సాగు చేస్తున్న కేసులో లింగాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో వ్యక్తికి రెండు సంవత్సరాలు జైలు శిక్ష, ఐదు వేల రూపాయల జరిమాన విధిస్తూ డిస్టిక్ సెషన్స్ కోర్ట్ ఆసిఫాబాద్ ప్రధాన న్యాయమూర్తి ఎంవి రమేష్ తీర్పు ఇచ్చినట్లు జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్ తెలిపారు. ఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం... గతంలో లింగాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఎస్సైగా విధులు నిర్వర్తిస్తున్న ఎన్.మధుకర్ పోలీస్ సిబ్బందితో తేదీ 25.10.2021 న నమ్మదగిన సమాచారం మేరకు రావునూర్ గ్రామ శివారులో పత్తి చేనులో గంజాయి సాగు చేస్తున్నారన్న సమాచారం మేరకు తనిఖీ నిర్వహించగా, కోట్నాక సోము తన, అమ్మ కోటినాక మోతుబాయ్ పేరు మీద గల మూడు ఎకరాల భూమిలో రెండు ఎకరాలు పత్తి పంట సాగు చేస్తున్నాడు. ఈ క్రమంలో గంజాయి పంట సాగు చేస్తే అధిక లాభాలు పొందవచ్చని, లాభాపేక్షతో పత్తి పంటలో గంజాయిని సాగు చేశాడు. అప్పటి లింగాపూర్ ఎ.ఎస్.ఐ కాతే బీమ్ రావు వారిపై కేసు బుక్ చేసి రెండవ ఐ.ఒ వాంకిడి సీఐ సుధాకర్, మూడవ ఐ.ఒ జైనూర్ సీఐ హానూక్‌లు విచారణ జరుపగా, ప్రస్తుత జైనూర్ సీఐ, లింగాపూర్ ఎస్ఐ లు సాక్షులను కోర్టులో హాజరుపరచగా పి.పి జగన్ మోహన్ రావు , ప్రధాన న్యాయమూర్తి ఎంవి రమేష్ విచారణ జరుపగా, నేరం చేసినట్లు రుజువు కావడంతో నిందితుడు కొట్నాక సోము కు రెండు సంవత్సరాలు జైలు శిక్ష మరియు 5 వేల రూపాయల జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి తీర్పు ఇచ్చారు. కేసులో నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన పిపి జగన్ మోహన్ రావు, ప్రస్తుత ఆసిఫాబాద్ సబ్ డివిజన్ ఏఎస్పీ చిత్తరంజన్ ఐపీఎస్, జైనుర్ సిఐ రమేష్, లింగాపూర్ ఎస్సై గంగన్న, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

# విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

**మంచిర్యాల, జూలై 14 (ప్రభాత సమాచారం)**

హాస్టల్లో చదువుకోవడం ఇష్టం లేక హాస్టల్ ఓ విద్యార్దిని భవనంపై నుండి దూకి ఆత్మహత్యాయత్ననికి పాల్పడిన సంఘటన మంచిర్యాల జిల్లా కేంద్రం నస్పూర్ మండలం కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో సోమవారం తీవ్ర కలకలం రేపింది. వివరాల్లోకి వెళితే.. నస్పూర్ మండలానికి చెందిన విద్యార్థిని కేజీబీవీ హాస్టల్‌లో 9వ తరగతి చదువుతుంది. హాస్టల్లో చదువుకోవడం ఇష్టం లేక హాస్టల్ భవనం నుండి దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. తీవ్ర గాయాల పాలైన విద్యార్థిని ఆసుపత్రికి తరలించారు.విద్యార్థినికి ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## యువతకు ఉపాధి అవకాశాలు
# కల్పించేందుకు డిఈఈటి

**మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



**మంచిర్యాల, జూలై 14 (ప్రభాత సమాచారం)**

జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు డిజిటల్ ఎంప్లాయిమెంట్ ఎక్స్చేంజ్ ఆఫ్ తెలంగాణ (డిఈఈటి) ఎంతో దోహదపడుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో మంచిర్యాల, బెల్లంపల్లి రాజస్వ మండల అధికారులు శ్రీనివాస్ రావు, హరికృష్ణ, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ శ్రీనివాస్ రెడ్డి, షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి అధికారి సిహెచ్. దుర్గాప్రసాద్, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ తిరుపతి లతో కలిసి డిఈఈటి సంబంధిత గోడప్రతులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ డి.ఈ.ఈ.టి. ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపర్చడం జరుగుతుందన్నారు. డిఈఈటి యాప్ ప్రభుత్వ, ప్రైవేట్ రంగాలలో ఖాళీగా ఉన్న ఉద్యోగాల వివరాలు ప్రతి రోజు నవీకరించబడతాయని, ఈ వేదిక ద్వారా అభ్యర్థులు తమ విద్యార్హత, అనుభవం ఆధారంగా తగిన ఉద్యోగాల కోసం శోధించవచ్చని, ఉద్యోగ నోటిఫికేషన్లు, ఇంటర్వ్యూలు, ఉద్యోగ మేళాలు, రెస్యూమ్ తయారీ, కెరీర్ మార్గదర్శకత వంటి సదుపాయాలు పొందుపర్చడం జరిగిందని తెలిపారు.

# పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక బస్సులు

**తాండూర్, జూలై 14 (ప్రభాత సమాచారం)**

ఆసిఫాబాద్ నుంచి వివిధ పుణ్యక్షేత్రాలకు ఆ ర్టీసీ ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సును నడపాలని ఆర్టీసీ అధికా రులు నిర్ణయించారు. ఈనెల 19న అసిఫాబాద్ డిపో నుంచి ఉదయం ఐదు గంటలకు సూపర్ లగ్జరీ బస్సు కొమ రవెల్లి దేవస్థానం,చేర్యాల, ఆలేరు,కొలనుపాక జైన దేవస్థానం, యా దగిరిగుట్ట దేవస్థానం,స్వర్ణగిరి దేవస్థానాలకు ప్రత్యేక బస్సు బయలుదేరుతుంది. ఆసిఫాబాద్ నుంచి పెద్దలకు టికెట్ ధర రూ.1500, పిల్లలకు రూ.800,ఐబి తాండూర్, బెల్లంపల్లి నుంచి పెద్దలకు టికెట్ ధర రూ.1400, పిల్లలకు టికెట్ ధర రూ.700నిర్ణయించారు. పుణ్యక్షేత్రాల టూర్ ప్రత్యేక బస్సుల ప్యాకేజీలను ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని అసిఫాబాద్ డిపో మేనేజర్ రాజశేఖర్ కోరారు. ఆన్లైన్ బుకింగ్ కోసం tgsrtc.tgsrtcbus.in 9959226006, 6300489162, 9493282510 నంబర్లను సంప్రదించాలని ఆయన సూచించారు.



# మండుతున్న కూరగాయల ధరలు

## బెంబేలెత్తుతున్న పేద, సామాన్య ప్రజలు -తగ్గిన దిగుబడితో తప్పని ఇక్కట్లు

**ఆదిలాబాద్ ప్రతినిధి, జూలై 11 (ప్రభాత సమాచారం)**

కూరగాయల ధరలు భగ్గుమంటున్నాయి. రోజు రోజుకూ పెరుగుతున్న కూరగాయల ధరలు సామాన్యుడి నడ్డి విరుస్తున్నాయి. ఏ కూరగాయలు కొనాలన్నా ధరలతో బెంబేలెత్తుతున్నారు. గతంలో కిలోకు వెచ్చించిన ధరతో ఇప్పుడు కనీసం పావుకిలో రావడం లేదని వాపోతున్నారు. జిల్లాలో ప్రధానంగా పట్టణ ప్రాంతాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లోని సంతల్లో కూడా కూరగాయల ధరలు భగ్గుమం టున్నాయి. మార్కెట్‌లోకి వెళ్లాలంటే పేద, మద్య తరగతి ప్రజలు ధైర్యం చేయలేని పరిస్థితి ఏర్పడింది. ఐదు, ఆరు నెలల క్రితం కూరగాయల ధరలు అందుబాటులో ఉన్నా ఇప్పుడు ఆకాశాన్నంటుతున్నాయి. బెండకాయ, టమాట, పచ్చి మిర్చి, చిక్కుడు, వంకాయ, పాలకూర, దొండకాయ ఇలా ఒకటే మిటి పలు రకాల కూరగాయల ధరలు పెరిగాయి. నిన్న మొన్నటి వరకు కిలో బెండకాయ రూ.30 నుంచి రూ.40 వరకు ఉండగా ఇటీవల కిలో బెండకాయ ధర రూ.100 పలు కుతోంది. వీటితో పాటు నిత్యావసరాల ధరలు కొండెక్కడంతో పేద కుటుంబాలకు మూడు పూటల కూరగాయల



భోజనం తాహతుకు మించిన భారంగా మారుతోంది. కూరగాయల ధరలు పెరుగుతుండడంతో సామాన్యుల పై భారం పడుతోంది. పదిహేను రోజుల్లో ధరలు బాగా పెరిగాయని ఇలా అయితే ఏం తినాలని సామాన్య, మధ్య తరగతి ప్రజలు ఆవేదన చెందుతున్నారు. జిల్లాలో ఓ వైపు వర్షాలు కురుస్తుండడంతో దిగుబడులు తగ్గి కూర గాయల ధరలు అమాంతంగా పెరిగిపోయాయి. రోజు రోజుకు ధరలు పెరిగిపోవడంతో సామాన్యుడిపై ఆర్థిక భారం పడుతోంది. ఏటా ఆషాఢం, శ్రావణమాసాల్లో ఇదే పరిస్థితి నెలకొం టుంది. వర్షాభావ పరిస్థితుల కారణంగా ప్రస్తుత సీజన్‌లో స్థానికంగా దిగుబడి తగ్గింది. ఇతర ప్రాంతాల నుంచి దిగు మతి చేసుకోవాల్సి రావడంతో ధరలపై ప్రభావం చూపుతోంది.

**సాగు అంతంతే..**

జిల్లాలో కూరగాయాల సాగు అంతంత మాత్రంగానే ఉంది. వరుస నష్టాలతో ఏటేటా కూరగాయాల సాగుకు రైతులు దూరమవుతున్నారు. పెట్టుబడులు పెరగడంతో కూరగాయాల సాగుకు రైతులు అంతగా ఆసక్తి చూపడం లేదు. దీనికి తోడు విత్తనాలు, ఎరువులు, పురుగుల మందుల ధరలు పెరిగిపోయాయి. జిల్లాలో రైతులు కూరగాయల పంటలు సాగు చేసిన పంట నిల్వలకు ఇబ్బందులు తప్పడంలేదు. దీంతో మార్కెట్‌లో పంటను తక్కువ ధరలకే విక్రయించాల్సిన పరి స్థితులు నెలకొన్నాయి. రైతుల వద్ద తక్కువ ధరలకు కొనుగొలు చేసి హోల్‌సెల్ వ్యాపారులు ధరలు పెంచి చిరు వ్యాపారులకు విక్రయి స్తున్నారు. దీంతో ధరలు అమాంతంగా పెరుగుతున్నట్లు వినియోగదారులు చెబుతున్నారు. దీనికి తోడు జిల్లాలో పంటల సాగు తగ్గడంతో పొరుగు రాష్ట్రాల నుంచి కొన్ని రకాల కూరగాయలను దిగుమతి చేసుకొని వ్యాపారులు చిరు వ్యాపారులకు విక్రయిస్తుండడంతో కూడా ధరలు పెరిగిపోతున్నాయి.

**- సామాన్యులకు భారం..**

వర్షకాలం ప్రారంభమై నెలరోజులు గడిచినా కూరగా యల ధరలు తగ్గక పోవడంతో పేదలు ఇబ్బందులు పడుతున్నారు. క్రమంగా ధరలు పెరుగుతుండడంతో సామాన్య, మధ్యతరగతి ప్రజలకు ఆర్థికంగా బారం పడుతోంది.

**ప్రస్తుతం కూరగాయల ధరలు(రూ. కిలోకు)**

పచ్చిమిర్చి 100, టమాటా 40, బీరకాయ 80, చిక్కుడు 80,కాలిఫ్లవర్ 100, కాప్సికం 80, క్యారేట్ 80, కాకరకాయ 60, క్యాబేజీ 40, వంకాయ 40, బెండకాయ 60, అలుసంద 40. అయితే జిల్లాలోని పలు గ్రామీణ ప్రాంతాల్లో వివిధ కూ రగాయలు సాగవుతు న్నాయి. ఇవి జిల్లా అవసరాలకు ఏమాత్రం సరిపోవడం లేదు. పట్టణాలు గ్రామాల్లో జరిగే వారంతపు సంతలకు వ్యాపారులు ఇతర ప్రాంతాల నుంచి తీసుకు వచ్చి కూరగాయలు విక్రయిస్తున్నారు. సాగు గణనీయంగా తగ్గి పోవడం, ఇతర ప్రాంతాల నుంచి రవాణా చేసుకోవాల్సి రావడంతో ధరలు మండుతున్నాయి. కూరగాయల ధరలు భారీగా పెరగడం తో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నలుగురు ఉన్న కుటుంబం వారం క్రితం కిలో కూరగాయలు కొనగా, ప్రస్తుతం పావుకిలోతో సరిపెట్టుకుంటున్నారు. మరి కొందరైతే చారు, పచ్చళ్ల తోనే కడుపు నింపుకుంటున్నారు. జిల్లాలో రైతులు సాగుచేస్తున్న కూరగాయలు ఇటీవల కురిసిన అకాల వర్షాలు దెబ్బతినడంతో దిగుబడులు తగ్గడంతో సరిపోవడం లేదు. రైతులు పండించిన వివిధ రకాల కూరగాయలు సుమారు పది వేల టన్నులు మాత్రమే దిగుబడి వస్తుంది. ప్రతీ రోజు జిల్లాకు 15 వేల టన్నుల కూరగాయలు అవసర మన్న అంచనాలున్నాయి. జిల్లా సాగు చేస్తున్న కూరగాయలు మండలాల్లో జరిగే వారంతపు సంతలకు ఎక్కువగా మహారాష్ట్ర నుంచి 70 శాతం దిగుమతి అవుతు న్నాయి. నిజామాబాద్, ఆదిలాబార్, నిర్మల్, కామారెడ్డి, హైదరాబాద్ జిల్లాల నుంచి ఎక్కువగా దిగుమతి చేస్తుండ డంతో రవాణా చార్జీలతో కలిపి ధరలు డబుల్ అవుతు న్నాయి. సోరకాయ, క్యాప్సి కమ్, క్యాబేజీ, క్యారెట్‌దిగుమతి అవుతున్నాయి.

# పాత కక్షలతో యువకుడిపై హత్యాయత్నం

## ముగ్గురు నిందితులను రిమాండ్‌కు తరలించిన పోలీసులు

**రామకృష్ణాపూర్, జూలై 14 (ప్రభాత సమాచారం)**

పాత కక్షల నేపథ్యంలో రామకృష్ణాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కొత్తతిమ్మాపూర్ గ్రామంలో ఆదివారం అర్ధ రాత్రి ఒక వ్యక్తిపై హత్యాయత్నం జరిగింది. గ్రామానికి చెందిన కొమ్మ సంతోష్ పై అదే గ్రామానికి చెందిన దుర్గం వెంకటేష్, అతని తల్లిదండ్రులు రాయపోశం, శారద కలిసి కత్తితో దాడి చేసినట్లు పోలీసులు తెలి పారు. కొన్ని రోజులుగా ట్రాక్టర్ల సమస్యపై సంతోష్‌తో వెంకటేష్ కుటుంబానికి వాగ్వాదం జరుగుతూ వస్తోంది. ఈ కక్షలతో ఆదివారం రాత్రి 10 గంటల సమయంలో సంతోష్‌ను వారి ఇంటికి పిలిపించుకున్నారు. అక్కడ సంతోష్ పై ఒకసారిగా దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో రాయపోశం, శారద సంతోష్ కాళ్లను పట్టుకోగా, వెంకటేష్ కత్తితో కడుపు, వీపు భాగంలో పొడిచాడు. తీవ్ర గాయాలైన సంతోష్ ను స్థానికులు వెంటనే ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న రామకృష్ణాపూర్ ఎస్సై రాజశేఖర్ ఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు.




# సీఎం సహాయ నిధి చెక్కు అందజేత

**బోథ్, జూలై 14 (ప్రభాత సమాచారం)**

మర్లపెల్లి గ్రామానికి చెందిన లాడేవార్ పార్వతి బోన్ మ్యారో సర్జరీ కోసం హైదరాబాదులోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం సీఎం సహాయనిధి కోసం దరఖాస్తు చేసుకున్నారు. మంజూరైన 14 లక్షల రూపాయల చెక్కును సోమవారం ఎమ్మెల్యే అనిల్ జాదవ్ కుటుంబ సభ్యులకు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేద మధ్యతరగతి ప్రజలు చికిత్స నిమిత్తం సీఎం సహాయ నిధిని ఉపయోగించుకోవాలన్నారు. మండలంలోని మామిడిగూడ గ్రామంలో హనుమాన్ ఆలయ నిర్మాణానికి సంబంధించిన రూ.12లక్షలప్రొసీడింగ్ కాపీని మామిడిగూడ గ్రామస్తులకు ఎమ్మెల్యే అందించారు.



# యుద్ధప్రాతిదికన రోడ్లు బాగు చేయాలి



**సిర్పూర్ (టి), జూలై 14 (ప్రభాత సమాచారం)**

మండలంలో ఏ గ్రామానికి వెళ్లినా రోడ్లు అధ్వానంగా ఉన్నాయని, శరవేగంగా బాగు చేయాలని బీఆర్ఎస్ మండల కన్వీనర్ అస్లాం బిన్ అబ్దుల్లా డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ప్రవీణ్‌కుమార్ ఆదేశాల మేరకు సోమవారం నాయకులు, కార్యకర్తలతో కలిసి మండల కేంద్రంలోని ఆర్ అండ్‌బీ రోడ్డుతో పాటు నవేగాం గ్రామంలో ధ్వంసమైన రోడ్లను పరిశీలించారు. వారు మాట్లాడుతూ బస్టాండ్ నుంచి రైల్వే స్టేషన్‌కు వెళ్లే రోడ్డు, బస్టాండ్ నుంచి కౌటలకు వెళ్లే ప్రధాన రహదారి, మహారాష్ట్రకు వెళ్లే అంతరాష్ట్ర రహదారులు పూర్తిగా అధ్వానంగా మారాయన్నారు. నవేగాం గ్రామం నుంచి వెంకట్రావ్‌పేట్ బైపాస్ రోడ్డు భారీ వాహనాలతో పాడైపోయినా పట్టించుకునే నాథుడు లేకుండా పోయాడని తెలిపారు. గతంలో ఇదే రోడ్డును బాగు చేస్తామని ప్రస్తుత ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు హామీ ఇచ్చారని, ఇంతవరకు నెరవేర్చలేదన్నారు. ఇకనైనా స్పందించకుంటే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు.

# నూతన సైన్స్ విధానంపై ప్రత్యేక దృష్టి : డీఈవో యాదయ్య

**నస్పూర్, జూలై 14 (ప్రభాత సమాచారం)**

నూతన సైన్స్ విధానంపై ప్రత్యేక దృష్టిసారించినట్లు మంచిర్యాల జిల్లా విద్యాధికారి ఎస్ యాదయ్య పేర్కొన్నారు. నస్పూర్‌లోని తీగల్‌పహాడ్‌లో గల పీఎంశ్రీ జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో సోమవారం అటల్ టెంకరింగ్ ల్యాబ్‌పై శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. జిల్లాలోని 19 పీఎంశ్రీ పాఠశాలలకు చెందిన భౌతిక, జీవ, గణితం పాఠాలు బోధించే స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులు శిక్షణకు హాజరయ్యారు. డీఈవో మాట్లాడుతూ మారుతున్న అవసరాలకు అనుగుణంగా సృజనాత్మకతను పెంపొందింపజేసే నూతన సైన్స్ పరికరాలను విద్యార్థులు వినియోగించుకునేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. భవిష్యత్తులో ప్రపంచంతో పోటీ పడాలంటే సైన్స్‌పై ప్రతీ విద్యార్థికి అవగాహన ఉండాలన్నారు. పాఠశాలలో నేటితో వంద అడ్మిషన్లు పూర్తి చేసుకున్న సందర్భంగా వందో అడ్మిషన్ పొందుతున్న విద్యార్థికి ఆయన అడ్మిషన్ అందజేశారు. విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యను అందించడానికి కృషి చేస్తున్న పాఠశాల హెడ్‌మాస్టర్ వామన్‌రావు, ఉపాధ్యాయుల బృందాన్ని ఆయన అభినందించారు. వనమహోత్సవం సందర్భంగా పాఠశాల ఆవరణలో విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి ఆయన మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో సెక్టోరియల్ అధికారులు సత్యనారాయణ మూర్తి, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



# ప్రభాస్‌కు ఫిదా అయిపోయా..



మంచు విష్ణు ప్రధాన పాత్రలో తెరకెక్కిన భారీ బడ్జెట్ చిత్రం 'కన్నప్ప'లో హీరోయిన్‌గా నటించిన ప్రీతి ముకుందన్, పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ గురించి ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. ప్రభాస్ చాలా స్వీట్ పర్సన్ అని, ఆయనతో కలిసి పనిచేయడం తన కెరీర్‌లోనే ఒక గొప్ప, మరచిపోలేని అనుభూతిని ఇచ్చిందని ప్రీతి ముకుందన్ పేర్కొన్నారు. 'కన్నప్ప' సినిమాలో ప్రభాస్ రుద్ర పాత్రలో శక్తివంతమైన ప్రదర్శనతో ప్రేక్షకులను అలరించారు. ప్రభాస్‌తో కలిసి తెరను పంచుకోవడం అద్భుతమని, ఆయన ఎంతో సరదాగా, మర్యాదగా ఉంటారని ప్రీతి ముకుందన్ పలు ఇంటర్వ్యూలలో తెలిపారు. ప్రభాస్‌తో మాట్లాడేటప్పుడు ఎప్పుడూ భయంగా అనిపించలేదని, ఆయన చాలా ఓపెన్‌గా ఉంటారని, ఎవరి సందేహాలనైనా తీర్చడానికి సిద్ధంగా ఉంటారని ప్రీతి వివరించారు. "ప్రభాస్‌తో కలిసి పనిచేయడం ఒక మెమోరబుల్ ఎక్స్‌పీరియన్స్. ఆయన చుట్టూ ఒక ప్రత్యేకమైన వైబ్ ఉంటుంది. ఆయన ఎప్పుడూ ఎవరినీ చిన్నగా చేసి చూడరు. సెట్‌లో అందరితో చాలా స్నేహంగా, గౌరవంగా ఉంటారు. ఆయన తన స్టార్‌డమ్‌ను ఎప్పుడూ ఎదుటివారిపై చూపించరు. ఆయన సాధారణ వ్యక్తిలా మాతో హ్యాపీగా ఉండేవారు. ప్రభాస్‌తో మాట్లాడేటప్పుడు నాకు ఎప్పుడూ భయంగా అనిపించలేదు. ఆయన చాలా ఓపెన్. ఆయన మంచితనానికి నేను ఫిదా అయిపోయాను" అని ప్రీతి ముకుందన్.. ప్రభాస్ వ్యక్తిత్వం గురించి ప్రశంసలు కురిపించారు. 'కన్నప్ప' సినిమాలో ప్రభాస్ రుద్ర పాత్ర ద్వారా సినిమాకి మరింత బలాన్ని చేకూర్చారు. ఈ సినిమాలో ప్రభాస్‌తో కలిసి నటించే అవకాశం వస్తుందని తాను కలలో కూడా ఊహించలేదని, ఇది తన సినీ కెరీర్‌లో ఒక ముఖ్యమైన ఘట్టమని ప్రీతి ముకుందన్ ఆనందం వ్యక్తం చేశారు. ఈ సినిమా విడుదలైన తర్వాత ఆమె నటనకు మంచి ప్రశంసలు లభించాయి. ప్రీతి ముకుందన్ "ఓం భీమ్ బుష్" చిత్రంతో తెలుగు తెరంగేట్రం చేశారు. 'కన్నప్ప' ఆమెకు పాన్ ఇండియా స్థాయిలో గుర్తింపు తెచ్చిపెట్టింది.



## పవన్ ఫ్యాన్స్ రెడీ అవ్వండమ్మా..

దాదాపు మూడేళ్ళుగా ఫ్యాన్స్ ఆసక్తిగా ఎదురుచూస్తున్న పవన్ కళ్యాణ్ 'హరిహర వీరమల్లు' ఈనెల 24న థియేటర్స్ లో విడుదల కానుంది. ఈ నేపథ్యంలో చిత్రబృందం ప్రీ రిలీజ్ ఈవెంట్ భారీ స్థాయిలో నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తోంది. ఈనెల 20న విశాఖపట్నం వేదికగా ప్రీ రిలీజ్ ఈవెంట్ ప్లాన్ చేసినట్లు తెలుస్తోంది. అంతేకాదు ఈ కార్యక్రమానికి మెగాస్టార్ చిరంజీవి, బాలయ్య ముఖ్య అతిథులుగా హాజరు కానున్నట్లు సమాచారం. ఇదిలా ఉంటే ఇప్పటికే ఈ సినిమా సెన్సార్ కార్యక్రమాలు పూర్తయ్యాయి. ఈ చిత్రానికి సెన్సార్ బోర్డు U/A సర్టిఫికెట్ జారీ చేసింది. అలాగే 2:42 నిమిషాలు రన్ టైం ఖరారైంది. హిస్టారికల్ బ్యాక్ డ్రాప్ లో భారీ బడ్జెట్ తో రూపొందిన ఈ చిత్రానికి జ్యోతికృష్ణ దర్శకత్వం వహించాడు. ముందుగా డైరెక్టర్ క్రిష్ జాగర్లమూడి ఈ ప్రాజెక్ట్ ని ప్రారంభించగా.. పలు కారణాల చేత ఆయన తప్పకున్నాడు. ఆ తర్వాత జ్యోతికృష్ణ టేకోవర్ చేశాడు. పవన్ రాజకీయాలతో బిజీగా ఉండడంతో చాలా ఆలస్యమైన ఈ సినిమా ఎట్టకేలకు ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఇప్పటికే విడుదలైన టీజర్, ట్రైలర్ సూపర్ బజ్ క్రియేట్ చేశారు. ఇందులో నిధి అగర్వాల్ కథానాయికగా నటించగా.. నోరా ఫతేహి, నర్గీస్ ఫక్రీ, సత్యరాజ్, సుబ్బరాజ్, బాబీ డియోల్, పూజిత పొన్నాడ, సునీల్, నాజర్, అనసూయ తదితరులు కీలక పాత్రల్లో నటించారు. మెగా సూర్య ప్రొడక్షన్ బ్యానర్ పై ఏఎం. రత్నం ఈ చిత్రాన్ని నిర్మించారు. ఆస్కార్ విజేత ఎం. ఎం. కీరవాణి సంగీతం అందించారు.



## అబ్బా అనిపిస్తున్న హెబ్బా నడుమందాలు..

యంగ్ బ్యూటీ హెబ్బా పటేల్ ఈ మధ్య సినిమాల్లో పెద్దగా కనిపించకపోయినా.. సోషల్ మీడియాలో మాత్రం ఫుల్ యాక్టీవ్ గా ఉంటుంది. ఎప్పటికప్పుడు తన గ్లామరస్ ఫొటో షూట్లతో నెటిజన్లను ఆకట్టుకుంటుంది. తాజాగా ట్రెండీ జీన్స్ లో ఈ ముద్దుగుమ్మ ఫోజులు కుర్రాళ్ళ చూపు తిప్పేస్తున్నాయి. హై వేస్ట్, థార్న్ స్టైల్ జీన్స్ విత్ వైట్ స్లీవ్ లెస్ టాప్ లో ఫొటోలకు స్టన్నింగ్ ఫోజులిచ్చింది. ఈ పిక్స్ ప్రస్తుతం నెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి. ఈ పిక్స్ చూసిన వారంతా హెబ్బా ఫ్యాషన్ సెన్స్ కి ఫిదా అవుతున్నారు. ఆమె పిక్స్ పై లైకులు వర్షం కురిపిస్తున్నారు. హెబ్బా తెలుగులో 'నేను నాన్న నా బాయ్ ఫ్రెండ్స్' యూత్ లో ఫుల్ క్రేజ్ దక్కించుకుంది. ఆ తర్వాత ఈ బ్యూటీ పలు సినిమాల్లో నటించినప్పటికీ ఆశించిన స్థాయిలో విజయం దక్కలేదు. రీసెంట్ గా 'ఓదెల' సినిమాతో మరోసారి ప్రేక్షకులను మెప్పించింది. హెబ్బా తెలుగుతో పాటు తమిళ్, కన్నడ సినిమాల్లోనూ నటించింది. కుమారి 21f సినిమాలో ఈ ముద్దుగుమ్మ నటనకు బెస్ట్ డెబ్యూ యాక్ట్రెస్ గా ఫిల్మ్ ఫెయిర్ అవార్డు లభించింది.

## రొమాంటిక్ గా మారిన ప్రియదర్శి..




కమెడియన్ కెరీర్ మొదలు పెట్టి.. ఇప్పుడు లీడ్ రోల్స్ నటించే స్థాయికి ఎదిగాడు నటుడు ప్రియదర్శి. మంచి కంటెంట్ ఉన్న సబ్జెక్ట్స్ ఎంచుకుంటూ తన టాలెంట్ ప్రూవ్ చేసుకుంటున్నాడు. ఇటీవలే 'కోర్ట్' సినిమాతో సూపర్ హిట్ విజయాన్ని అందుకున్న దర్శి.. మరో యూత్ ఫుల్ రొమాంటిక్ ఎంటర్ టైనర్ తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు. తాజాగా తన తదుపరి ప్రాజెక్ట్ అనౌన్స్ చేశాడు. 'ప్రేమంటే' అనే టైటిల్ తో రాబోతున్న ఈ చిత్రంలో ప్రియదర్శి-ఆనంది హీరోహీరోయిన్లుగా నటిస్తున్నారు. ఈ మేరకు మూవీ ఫస్ట్ లుక్ పోస్టర్ రిలీజ్ చేశారు. ఇందులో హీరో, హీరోయిన్ రొమాంటిక్ లుక్ లో కనిపించారు. 'థ్రిల్ యు ప్రాప్తిరస్తు' అనే ట్యాగ్ లైన్ తో సినిమాపై ఆసక్తిని పెంచారు. అక్కినేని హీరో నాగ చైతన్య మూవీ ఫస్ట్ లుక్ పోస్టర్, టైటిల్ వీడియో లాంచ్ చేశారు. రొమాంటిక్ డ్రామాగా రూపొందుతున్న ఈ సినిమాకు నవనీత్ శ్రీరామ్ దర్శకత్వం వహిస్తున్నారు. SVCLLP బ్యానర్ పై పుస్కుర్ రామ్ మోహన్ రావు, సునీల్ నారంగ్ కుమార్తె జాన్వి నారంగ్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. రానా దగ్గుబాటి సమర్పిస్తున్నారు. లియోన్ జేమ్స్ అద్భుతమైన సంగీతం అందిస్తున్నారు. ఈ చిత్రంలో యాంకర్ సుమ కనకాల కూడా కీలక పాత్ర పోషిస్తున్నారు. ఇప్పటికే మొదలైన ఈ సినిమా షూటింగ్ 65% పూర్తయినట్లు సమాచారం. త్వరలోనే విడుదల తేదీ కూడా ప్రకటించనున్నారు.



# ముందుకు సాగని ఆర్‌వోబి

- ఎక్కడి పనులు అక్కడే..
- భూ సేకరణ నిధుల విడుదలలో జాప్యం
- వాహనదారుల ఇబ్బందులు
- త్వరగా పూర్తయ్యేలా చూడాలంటున్న ప్రజలు

**ఆదిలాబాద్, జూలై 14 (ప్రభాత సమాచారం)**

ఆదిలాబాద్ పట్టణంలోని రైల్వే క్రాసింగ్ వద్ద వాహనదారుల ఇబ్బందులను తొలగించడంతోపాటు ట్రాఫిక్ సమస్య నివారణ కోసం చేపట్టిన రైల్వే ఓవర్ బ్రిడ్జి పనుల్లో జాప్యం జరుగుతున్నది. ఆర్‌వోబీ పనులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.97.20 కోట్ల అంచనాతో చేపట్టాయి. ఇందులో రాష్ట్రం వాటా రూ.57.20 కోట్లు, కేంద్రం వాటా రూ.39.49 కోట్లుగా నిర్ణయించారు. వంతెన పొడువు 931.825 మీటర్లు. మూడేండ్ల కిందట పనులు ప్రారంభమయ్యాయి. రైల్వేట్రాక్ భాగంలోని పనులను రైల్వేశాఖ, మిగతా పనులను రోడ్లు భవనాల శాఖ అధికారులు పర్యవేక్షిస్తున్నారు. వంతెన నిర్మాణంలో భాగంగా స్పిన్నింగ్ మిల్లు క్రాసింగ్ నుంచి వరకు 30 పిల్లర్లు వేసి స్లాబులు పూర్తి చేశారు. ఎల్ఐసీ కార్యాలయం వైపు 220.512 మీటర్ల వంతెన నిర్మించాల్సి ఉండగా.. భూ సేకరణకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో పనులు నిలిచాయి. వాహనదారుల ఇబ్బందులు

తాంసి బస్టాండ్ వద్ద రైల్వే కింద వంతెనను రూ.20 కోట్లతో నిర్మించాల్సి ఉంది. వ్యవసాయ మార్కెటింగ్ కార్యాలయం నుంచి పంజాబ్ చౌరస్తా వరకు 292 మీటర్ల పనులు జరగాలి. వంతెన పనుల నిర్మాణంలో భాగంగా రోడ్డుకు రెండు పక్కల ఉన్న ప్రైవేటు దుకాణాలకు అధికారులు మార్కింగ్ చేశారు. వీరికి పరిహారం రూ.11 కోట్లు చెల్లించాల్సి ఉండగా.. ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో పనులు ముందుకు సాగడం లేదు.పట్టణంలోని రెండు రైల్వే క్రాసింగ్‌లు తాంసి బస్టాండ్, స్పిన్నింగ్ మిల్లు వద్ద ఉన్నాయి. జిల్లా కేంద్రానికి వివిధ ప్రాంతాలకు వెళ్లే రైళ్లతోపాటు గూడ్స్ ట్రెయిన్‌లు వస్తుంటాయి. దీంతో రోజు 20 నుంచి 30 సార్లు గేటు పడుతుంది. ఆదిలాబాద్ పట్టణంతో తాంసి, తలమడుగు, భీంపూర్ మండలాలు, మహారాష్ట్రలోని వివిధ ప్రాంతాలకు వెళ్లేవారు రైల్వే క్రాసింగ్‌లు దాటాల్సి వస్తున్నది. తరచుగా గేటు పడడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో విధులు నిర్వహించే సిబ్బంది, విద్యార్థులు, అంబులెన్స్‌లు నిలిచిపోవాల్సి వస్తున్నది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి ఆదిలాబాద్ రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులు తొందరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.





### వలస లంబాడీల కుల ధ్రువీకరణ
## పత్రాలు రద్దు చేయాలి

**నార్నూర్, జూలై 14 (ప్రభాత సమాచారం)**

వలస వచ్చిన లంబాడీలపై విచారణ చేపట్టి కుల ధ్రువీకరణ పత్రాలు రద్దు చేయాలని ఆదివాసి సంక్షేమ పరిషత్ జిల్లా అధ్యక్షుడు రామారావు డిమాండ్ చేశారు. ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండల డిప్యూటీ తహసీల్దార్ శ్యాం సుందర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1950 తర్వాత వలస వచ్చిన లంబాడీలపై విచారణ చేపట్టి కుల ధ్రువీకరణ పత్రాలను రద్దు చేయాలని కోరారు. లంబాడి తెగకు చెందిన కొందరు వ్యక్తులు గిరిజనుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని వారు సాగు చేసే భూములకు పట్టాలు చేసుకున్నారని ఆరోపించారు. జిల్లాలోని లంబాడిగాకు చెందిన కుటుంబాలు విచ్చలవిడిగా వలస వచ్చి ఆదివాసుల రిజర్వేషన్, భూములను, ఉద్యోగులను దోచుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో గౌరవ ధ్యక్షుడు భీంరావు, ప్రచార కార్యదర్శి మడవి నటరాజ్, ఉపాధ్యక్షులు జైతు, ప్రధాన కార్యదర్శి గోవింద్, సంతోష్, వినోద్, సోనేరావు, కేశరావు తదితరులున్నారు.

## మౌలిక వసతులు కల్పించండి

**ముథోల్, జూలై 14 (ప్రభాత సమాచారం)**

గ్రామంలో కనీస వసతులు లేక గ్రామ స్తులు సమస్యలతో సతమా త మ వుతున్నామ ంటూ కుబీర్ మండలం సాంగ్వీ గ్రామానికి చెందిన గ్రామ స్తులు సోమవారం ప్రజా వాణిలో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, అడిషనల్ కలెక్టర్ ఫైజాన్ అహ్మద్‌కు సమస్యలు విన్నవించి వినతిపత్రం అందించారు. గ్రామంలో రోడ్డు నిర్మాణం, బస్సు సౌకర్యం, స్మశాన వాటికకు సీసీ రోడ్డు, విద్యుత్ సదుపాయం, గ్రామ పంచాయతీ, అంగన్‌వాడీ భవనల నిర్మాణాలు చేపట్టి ప్రధాన సమస్యలను తీర్చాలని కోరారు. జిల్లాలోనే మా గ్రామం ప్రభుత్వ బడిలో పిల్లల నమోదు చేస్తున్నామని, ప్రస్తుతం ప్రాథమిక పాఠశాలగా ఉన్న బడిని ప్రాథమికోన్నత పాఠశాలగా అప్ గ్రేడ్ చేసే చర్యలు చేపట్టాలని కోరారు.

### 17 నుంచి రాష్ట్రస్థాయి జూనియర్
## బ్యాడ్మింటన్ ఛాంపియన్ షిప్ పోటీలు




**నిర్మల్, జూలై 14 (ప్రభాత సమాచారం)**

నిర్మల్ లోని కొండాపూర్‌లోగల నిర్మల్ స్పోర్ట్స్ అకాడమీలో ఈనెల 17వ తేదీ నుంచి 20వ తేదీ వరకు రాష్ట్రస్థాయి జూనియర్ బ్యాడ్మింటన్ ఛాంపియన్ షిప్ పోటీలు నిర్వహిస్తున్నట్టు స్టార్ మంచిర్యాల డిస్ట్రిక్ట్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు గాజుల ముఖేష్ గౌడ్, ప్రధాన కార్యదర్శి పుల్లూరి సుధాకర్ తెలిపారు. రాష్ట్రస్థాయిలో అండర్ 19 బాలు రు, బాలికలకు సింగిల్స్, డబుల్స్, మిక్స్ డబుల్స్ విభాగాలలో బ్యాడ్మింటన్ పోటీలు ఉంటాయని తెలిపారు. జూలై 17న క్వాలిఫైయింగ్ పోటీలు, జూలై 18 తేదీ నుంచి 20వ తేదీ వరకు మెయిన్ డ్రా పోటీలు ఉంటాయ ని తెలిపారు. 18వ తేదీ ఉదయం 10గంటల కు రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీల ప్రారంభోత్సవం ఉంటుందని ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యేతో పాటు జిల్లాలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీ హాజరవుతారని తెలిపారు. జూలై 20 తేదీన ఫైనల్ పోటీలు జరుగుతాయని తెలిపారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి సుమారుగా 400 మంది వరకు బ్యాడ్మింటన్ క్రీడాకారులు హాజరుకానున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టోర్నమెంట్ ఆర్గనైజింగ్ కమిటీ కన్వీనర్ కిషోర్, కో కన్వీనర్ వన్నెల భూమన్న, కోఆర్డినేటర్లు సందీప్, మధుకర్ గౌడ్, మహేష్, ప్రణీత్, నంద కుమార్, పెటా సంఘం జిల్లా ప్రెసిడెంట్ భూక్యా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

### పచ్చని పెళ్లి పందిరిలోకి వెళ్లాల్సిన వరుడు
## అంతలోనే అనంతలోకాలకు







**ఖానాపూర్, జూలై 14 (ప్రభాత సమాచారం)**

వారంలోనే పెళ్లి పందిరిలో అడుగుపెట్టాల్సిన వరుడు, పెళ్లి పత్రికలు పంచుతుండగానే మృత్యువాత పడి ఆ కుటుంబంలో విషాదం నింపాడు. జన్నారం మండలం ఇందన్‌పల్లి గ్రామానికి చెందిన చొప్పదండి గంగన్న, కమల దంపతుల కుమారుడు చొప్పదండి లక్ష్మాన్ (25) తన పెళ్లికి సంబంధించి బంధువులకు పత్రికలు ఇచ్చేందుకు ఆదివారం నిర్మల్ జిల్లాకు వెళ్లాడు. తన స్నేహితుడు జాశ్వత్ తో కలిసి ద్విచక్ర వాహనంలో ఖానాపూర్ మండల కేంద్రంలోని కొమురం భీమ్ చౌరస్తా సమీపానికి రాగానే బైక్ అదుపుతప్పి కల్వర్టు కు ఢీకొని చెట్ల పొదల్లో పడిపోయింది. ఈ ప్రమాదంలో లక్ష్మాన్ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, అతని స్నేహితుడు జాశ్వత్ కూడా గాయాలతో అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఖానాపూర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.



### యూరియా కోసం
## రైతుల ఆందోళన

**భీమిని, జూలై 14 (ప్రభాత సమాచారం)**

భీమిని మండల కేంద్రంలోని ప్రాథమిక సహకార సంఘం కార్యాలయం వద్ద సోమవారం రైతులు యూరియా కోసం ఆందోళన చేపట్టారు. పెద్ద సంఖ్యలో తరలివచ్చి సరిపడా యూరియా పంపిణీ చేయాలని సీఈవో రాజేశ్వర్‌తో వాగ్వాదానికి దిగారు. దీంతో సిబ్బంది యూరియా పంపిణీని నిలిపివేశారు. రైతులు ఆగ్రహం వ్యక్తం చేయడంతో పోలీసులు గొడవ సద్దుమణిగేలా చేశారు. ఏడీఏ సురేఖ అక్కడికి చేరుకొని రైతులతో మాట్లాడారు. యూరియా ఎక్కువ ధరకు విక్రయిస్తున్నట్లు సరైన ఆధారాలు దొరికితే దుకాణాదారులపై చర్యలు తీసుకుంటామన్నారు. మార్క్‌ఫెడ్ ద్వారా ఇంకా ఎక్కువ యూరియా అందేలా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్తానని, రైతులు ఆందోళన చెందవద్దన్నారు. ఆపై యథావిధిగా యూరియా పంపిణీ కొనసాగింది. సీఈవో రాజేశ్వర్ రైతులతో మాట్లాడుతూ భీమిని, కన్నెపల్లి మండలాలకు కలిపి ఒకే సొసైటీ భీమినిలో ఉందని, కాబట్టి కన్నెపల్లి మండల రైతులకు కూడా భీమిని నుంచే పంపిణీ చేస్తామన్నారు. ఇప్పటి వరకు 780 బ్యాగులు పంపిణీ చేశామన్నారు. ఏడీఏ వెంట వ్యవసాయాధికారి యమునదుర్గ, ఏఈవోలు వినోద్, కార్తీక్, అఫ్రోజ్, తదితరులు ఉన్నారు.

## బోనమెత్తిన ఎమ్మెల్యే

**ఆసిఫాబాద్, జూలై 14 (ప్రభాత సమాచారం)**

ఆషాఢ మాసం పురస్కరించుకొని రెబ్బెన మండలం వంకులం గ్రామ సమీపంలోని పెద్దవాగు వద్ద గల గాంధారి మైసమ్మకు ఎమ్మెల్యే కోవలక్ష్మి భోనం సమర్పించారు. పంకులం గ్రామ ప్రజల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో మహిళలు, ప్రజలు డోలు వాయిద్యాలతో నృత్యాలు చేస్తూ బోనాల పండుగను అంగరంగ వైభవంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సంజీవ్, మహేష్, తిరుపతి, ఓమాజీ, నాగయ్య పాల్గొన్నారు.

# విద్యారంగంపై ప్రభుత్వ నిర్లక్ష్యం

## తరగతి గదుల పెండింగ్ పనులను పరిశీలించిన మాజీ మంత్రి జోగు రామన్న



**ఆదిలాబాద్, జూలై 14 (ప్రభాత సమాచారం)** విద్యారంగం పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని మాజీ మంత్రి జోగు రామన్న మండిపడ్డారు. పెండింగ్ పనులకు బిల్లులు చెల్లించకుండా అలసత్వం వహిస్తోందని ఆరోపించారు. సోమవారం భీంసరి ప్రభుత్వ పాఠశాలను బీఆర్ఎస్ పార్టీ శ్రేణులతో కలిసి సందర్శించి, ఈ సందర్భంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన అదనపు తరగతి గదులు, ప్రహరీ గోడ నిర్మాణం నిలిచిపోయిన పనులను పరిశీలించారు. ఉపాధ్యాయులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జోగు రామన్న మాట్లాడుతూ... గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మన ఊరు మనబడి కింద రూ.30 లక్షలతో అదనపు తరగతి గదులు, రూ.17 లక్షలతో కంపౌండ్ వాల్ నిర్మాణం చేపట్టడం జరిగిందన్నారు. గత సీఎం కేసీఆర్ చేపట్టిన పథకాలకు సబంధించిన బిల్లులు ఇవ్వకపోవడం సరైనది కాదన్నారు. ప్రభుత్వ పాటశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా అవసరమైన పూర్తి చర్యలు తీసుకోవాలన్నారు. భీంసరిలో 287 మందికి గానూ 36 మందికి మాత్రమే ఇందిరమ్మ ఇండ్లు కట్టిస్తున్నారని, మిగిలిన వారి పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ చైర్మన్ మెట్టు ప్రహ్లాద్, మాజీ ఎంపీపీలు సేవ్వా జగదీష్, గంధ్రత్ రమేష్, బట్టు సతీష్, కనక రమణ, దేవిదాస్, కుమ్రా రాజు, రాజేష్, కొత్తపల్లి సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



### కోనప్ప సహాయంతో

# కల్వర్టుకు మరమ్మతులు

**బెజ్జూర్, జూలై 14 (ప్రభాత సమాచారం)** మండలంలోని సోమిని గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారిలోని రెండులో లెవెల్ కల్వర్టులకు కోనేరు అభిమానులు మరమ్మతులు చేయించారు. పైపులలో చెత్త ఇసుక పేరుకుపోయిందని మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్పకు ఫోన్ ద్వారా గ్రామ ప్రజలు సమాచారం అందించడంతో స్పందించిన ఆయన జెసిబిని పంపించి మరమ్మతులు చేశారు. బెజ్జూర్ నుండి సోమిని వరకు ఉన్నటువంటి ప్రధాన రహదారికి మంజూరైన 3 లక్షల రూపాయల బిల్లులను లేపునట్లు తెలిసిందని ఆరోపించారు. కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి ఆత్రం సాయన్న, లంగారి శ్రీనివాస్, మాజీసర్పంచులు, ఉపసర్పంచ్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### పోలీసుల విధులకు ఆటంకం

# కలిగించిన వారిపై కేసు

**ఉట్నూర్, జూలై 14 (ప్రభాత సమాచారం)** పోలీసులకు ఆటంకం కలిగించిన ఇద్దరిపై వ్యక్తులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై ప్రవీణ్ తెలిపారు. ఇటీవల ఉట్నూర్‌లోని ఎన్టీఆర్ చౌరస్తాలో వాహనాల తనిఖీలు చేపడుతున్నమని, ఆ సమయంలో మోమిన్ పురకి చెందిన షేక్ ఇమ్రాన్, షేక్ సమీర్ ఇద్దరు యువకులు మద్యం మత్తులో ఉండి విధులకు ఆటంకం కలిగించడమే కాకుండా పోలీసులతో దురుసుగా ప్రవర్తించారు. పోలీసులకు విధులకు ఆటంకం కలిగించిన వారిపై కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఎస్సై ప్రవీణ్ మాట్లాడుతూ విధుల్లో ఉన్న పోలీసుల పట్ల దురుసుగా ప్రవర్తిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు.

# క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగాలి

**ఆసిఫాబాద్, జూలై 14 (ప్రభాత సమాచారం)** క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. ఆసిఫాబాద్ మండలం బాబాపూర్‌లోని మహాత్మా జ్యోతి బాపూలే బాలికల పాఠశాల, కళాశాలకు చెందిన విద్యార్థినిలు హిమబిం దు, బిక్కుబాయి ఇటీవల ఎవరెస్టు శిఖరం బేస్ పాయింట్ చేరుకుని జాతీయ జెండాను ఆవిష్కరించారు. సోమవారం కలెక్టరేట్ కార్యాలయంలోని చాంబర్‌లో ఎవరెస్ట్ ఎక్కి న విద్యార్థినిలను అదనపు కలెక్టర్ దీపక్ తివారితో కలసి కలెక్టర్ శాలువాతో సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చదువుతోపాటు తమకు ఆసక్తి ఉన్న రంగంలో రాణించేందుకు పట్టుదలతో కృషి చేయాలన్నారు.



ఎవరెస్ట్ అధిరోహించిన పూర్ణ స్ఫూర్తితో వివరిస్తూ అధిరోహించాలని విద్యార్థులకు సూ చించారు. డిడబ్ల్యూవో ఆడెపు భాస్కర్, డిఆర్‌డిఓ దత్త రావు, ప్రిన్సిపాల్ సుకన్య ఉన్నారు.

# జీవో 49 రద్దు చేసే వరకు ఉద్యమిస్తాం



**ఆదిలాబాద్, జూలై 14 (ప్రభాత సమాచారం)** ఆదివాసీ లకు అన్యాయం చేసే జీవో నెంబర్ 49ని రద్దు చేయాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుం దెబ్బ) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గోడం గణేశ్ డిమాండ్ చేశారు. తుడుం దెబ్బ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు తహసీల్దార్ లకు వినతి పత్రాన్ని అందించడంలో భాగంగా సోమవారం ఉట్నూర్ ఐటీడీఏ పీవో కుష్బూ గుప్తా ను కలిసి వినతి పత్రాలు అందజేశారు. అనంతరం గోడం గణేష్ మాట్లాడుతూ జీవో నెంబర్ 49 పేరుతో ఆదివాసీల మనగడ ను ప్రశ్నార్థకంగా మారుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అడవులనే నమ్ముకుని అడవుల్లో జీవిస్తున్న ఆదివాసీ లను అడవుల నుండి వెళ్ళగొట్టడం కుట్రలో భాగమని పేర్కొన్నారు. 49 జి.ఓ రద్దు అయ్యేంత వరకు ఆదివాసీ సంఘాలు, తుడం దెబ్బ, రాయి సెంటర్, రాజ్ గోండ్ సేవ సమితి, కుల సం ఘాలు, ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాలు కల్సి ఉద్యమలు చేపడతామన్నారు. కార్యక్రమంలో ఆదివాసి గిరిజన సంఘ ప్రతి నిదులు పుర్క బాపురావు, పంద్ర జైవంత్ రావ్, పెందూర్ దాదారావు, తిరుపతి, నాగోరావు, మెస్రం నాగనాథ్ పాల్గొన్నారు.



### ఘనంగా భీమన్న దేవుడి

# పండుగ వేడుకలు

**ఆదిలాబాద్, జూలై 14 (ప్రభాత సమాచారం)** ముదిరాజ్ కులస్తుల ఆరాధ్య దైవం భీమన్న దేవుడి పండుగను కులస్తులు ఘనంగా జరుపుకున్నారు. ఆషాడ మాసం సందర్భంగా స్థానిక గాంధీపార్క్‌లోని భీమన్న ఆలయంలో సోమవారం నిర్వహించిన పండుగలో ఎమ్మెల్యే పాయల్ శంకర్ పాల్గొని భీమన్న దేవునికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ... ముదిరాజ్ కులస్తుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తామన్నారు. భీమన్న ఆలయాన్ని అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. మరోవైపు మాజీ మంత్రి జోగు రామన్న సైతం భీమన్న దేవుని పండగ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సం దర్భంగా భీమన్న దేవుడికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ మేరకు జోగు రామన్న మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఆలయాల నిర్మాణాలకు ప్రభుత్వ నిధులను కేటాయించిన ఘనత కేసీఆర్‌కే దక్కిందన్నారు. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికత వైపు అడుగులు వేస్తూ, మానసిక ప్రశాంతతను పెంపొందించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ కుల స్తులు ధారవేణి రాము, బొజ్జ సంతోష్, దార్ష రవి, నగేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

### ఒప్పంద పద్ధతిన పోస్టుల

# భర్తీకి దరఖాస్తుల స్వీకరణ

### ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ సులేమాన్

**మంచిర్యాల, జూలై 14 (ప్రభాత సమాచారం)** జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాల, ప్రభుత్వ ఆసుపత్రిలో పని చేసేందుకు కంట్రోల్ ఆఫ్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్-తెలంగాణ క్రింద ఒప్పంద, గౌరవ వేతన పద్ధతిన పోస్టుల భర్తీ కొరకు అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ సులేమాన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఒప్పంద పద్ధతిన ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టులు, గౌరవ వేతన పద్ధతిన సీనియర్ రెసిడెంట్ పోస్టును తాత్కాలిక పద్ధతిలో భర్తీ చేయడం జరుగుతుందని, 31 మార్చి, 2026 వరకు / అవసరం మేరకు / రెగ్యులర్ ఉద్యోగుల భర్తీ వరకు పని చేయవలసి ఉంటుందని తెలిపారు. అర్హత గల అభ్యర్థులకు ఈ నెల 18వ తేదీ ఉదయం 10 గం౹౹ల నుండి మధ్యాహ్నం 2 గం౹౹ల వరకు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ కార్యాలయంలో వాక్-ఇన్-ఇంటర్వ్యూ నిర్వహించడం జరుగుతుందని, వివరాలకు https://www.gmcmancherial.org వెబ్‌సైట్‌లో సంప్రదించవచ్చని ఆయన తెలిపారు.

# జాతీయ పురస్కారం అందుకున్న జర్నలిస్టు క్రాంతి కుమార్

**మందమర్రి, జూలై 14 (ప్రభాత సమాచారం)** అంతర్జాతీయ సేవా సంస్థ తెలుగు సంస్కృతి సాహితి సేవా ట్రస్ట్, తెలంగాణ సంస్కృతి సాహితీ బుక్ ఆఫ్ రికార్డ్స్ సంయుక్త ఆధ్వర్యంలో వరంగల్‌లోని రామయ్య ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం ఆద్యంతం వీక్షకులను విశేషంగా అలరించాయి. ఈ వేడుకల్లో మంచిర్యాల జిల్లాకు చెందిన జర్నలిస్ట్ జాడ క్రాంతి కుమార్ దేశవ్యాప్తంగా గుర్తింపు పొందారు. ఈ కార్యక్రమానికి పలువురు ప్రముఖులు ముఖ్య అతిథులుగా హాజరై, వివిధ రంగాలకు చెందిన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ వివిధ రాష్ట్రాలకు చెందిన వారిని వివిధ పురస్కారాలతో ఘనంగా సత్కరించి, ఘనంగా సన్మానించి, జ్ఞాపికలు అందజేశారు. ఈ వేడుకల్లో ఉత్తమ జర్నలిస్టుల విభాగంలో జిల్లాలోని మందమర్రి పట్టణానికి చెందిన జాడ క్రాంతి కుమార్ కు జాతీయ మహానంది అవార్డు-2025ను అందజేసి, ఘనంగా సన్మానించారు. అవార్డు అందుకున్న ఆయనను జర్నలిస్టులు, స్నేహితులు, అభినందించారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీత మాట్లాడుతూ, ఈ గౌరవం తనకు మరింత బాధ్యతను పెంచిందని తెలిపారు. ప్రజలకు వాస్తవ పరిస్థితులు అవగతం అయ్యేలా, నిజాలను వెలికి తీసేందుకు, న్యాయంగా సమాచారం



ప్రజలకు, అదేవిధంగా ప్రభుత్వానికి అందించేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ వ్యవస్థాపక చైర్మన్ మాచవరం గౌరీశంకర్, ఆర్గనైజింగ్ కార్యదర్శి బట్టు శ్రీనివాస్ రావు తదితరులు పాల్గొన్నారు.

# దివంగత కాంగ్రెస్ నేత అబ్దుల్ ఖయ్యూం సేవలు మరువలేనివి





- ఖయ్యూం సంస్మరణ సభలో
- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్
- ఖయ్యూం కుటుంబ సభ్యులకు రూ.లక్ష రూపాయల ఆర్థిక సాయం అందజేసిన ఎమ్మెల్యే

**ఉట్నూర్, జూలై 14 (ప్రభాత సమాచారం)**

పార్టీలో చురుకుగా పనిచేస్తూ పార్టీ బలోపేతం కోసం నిత్యం పాటు పడిన కట్టర్ కాంగ్రెస్ వాది దివంగత కాంగ్రెస్ పార్టీ ఉట్నూర్ మండల అధ్యక్షులు అబ్దుల్ ఖయ్యూం అని,వారి మృతి పార్టీకి తీరని లోటని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ పేర్కొన్నారు. సోమవారం ఉట్నూర్ మండల కేంద్రం లోని తిరుమల ఫంక్షన్ హాల్లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో అబ్దుల్ ఖయ్యూం సంస్మరణ సభ నిర్వహించారు.ముందుగా వారి మృతిని చింతిస్తూ వారి ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిమిషాల మౌనం పాటించారు.అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ. 30ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీనే నమ్మి పార్టీ బలోపేతం కోసం చివరి శ్వాస వరకు కృషి చేసిన నేత అబ్దుల్ ఖయ్యూం అని తెలిపారు. నమ్మిన సిద్ధాంతం కోసం తన సర్వస్వాన్ని పార్టీకి అంకితం చేశారని, వారు లేని లోటు తీర్చలేనిదన్నారు. కష్టపడే తత్వాన్ని అలవర్చుకొని సమాజ హితం కోసం పాటు పడిన వ్యక్తి అని అన్నారు. ప్రభుత్వ పరంగా వారి కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇస్తామని హామీ ఇచ్చారు. ఏ సహాయ సహకారాలు కావాలన్నా తన ఇంటి తలుపులు ఎల్లప్పుడూ తెరచి ఉంటాయన్నారు. ఎమ్మెల్యే తనవంతుగా 1లక్ష రూపాయల ఆర్థిక సహాయాన్ని అబ్దుల్ ఖయ్యూం కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# కులవృత్తులకు చేయూతనిచ్చేలా సంక్షేమ పథకాలు

- పీఎం విశ్వకర్మ పథకం శిక్షణ సర్టిఫికెట్లను అందజేసిన ఎంపీ నగేశ్, ఎమ్మెల్యే పాయల్ శంకర్



**ఆదిలాబాద్, జూలై 14 (ప్రభాత సమాచారం)**

కుల వృత్తిదారుల ఆదాయాన్ని పెంచి, వారిని ఆర్థికంగా బలోపేతం చేయడానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అనేక కార్యక్రమాలు చేపడుతున్నారని ఎంపీ గోడం నగేష్ అన్నారు. ప్రధాన మంత్రి విశ్వకర్మ వృత్తి నైపుణ్యం శిక్షణ పొందిన వారికి సోమవారం ఎమ్మెల్యే పాయల్ శంకర్‌తో కలిసి ఎంపీ సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీ, ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సమాజంలో ఉన్న అన్ని కుల వృత్తి లకు చెందిన వారికి ఆర్థికంగా బలోపేతం చేయడానికి వృత్తి నైపుణ్యం ఇచ్చి వారికి సహాయ సహకారాలు అందించడానికి కృషి చేస్తున్నారని అన్నారు. ప్రభుత్వం కోట్ల రూపాయలను వెచ్చించి శిక్షణనిస్తోందని, శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకుని తమ నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమం బీజేపీ నాయకులు రాజు, సుభాష్, ప్రవీణ్, కృష్ణ, సురేష్, చంద్రకాంత్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

విలేకరులు
కావలెను
ప్రభాత సమాచారం
ఆదిలాబాద్ Digital Edition
మంచిర్యాల - కొమురం భీం ఆసిఫాబాద్ - నిర్మల్
వినూత్న రీతిలో వెలువడుతూ విశేష ఆదరణ పొందుతున్న ప్రభాత సమాచారం తెలుగు దినపత్రికకు ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పని చేయుటకు జిల్లాల వారిగా సాఫ్ట్ రిపోర్టర్లు, నియోజకవర్గాల వారిగా ఆర్సీ ఇన్‌చార్జీలు, మండలాల వారిగా విలేకరులు కావలెను.
ఆసక్తి ఉన్నవారు సంప్రదించండి
9440977660, 9110718194
PRABHATHASAMACHARAM.COM
TELANGANA TELUGU DAILY

## 100 డయల్ వాహనాలకు
# ఇక జీపీఎస్ సేవలు



**నిర్మల్, జూలై 14 (ప్రభాత సమాచారం)**

జిల్లా పోలీసింగ్‌లో పారదర్శకతను పెంపొందించడమే లక్ష్యంగా, ఎస్పీ డా.జి. జానకి షర్మిల ఆదేశాల మేరకు నిర్మల్ జిల్లాలో నడుస్తున్న మొత్తం 100 డయల్ వాహనాలకు నూతన జీపీఎస్ పరికరాలను అమర్చారు. ఈ ఆధునిక టెక్నాలజీ సాయంతో, అత్యవసర పరిస్థితులలో ఘటనాస్థలానికి పోలీసులు వేగంగా చేరుకోగలుగుతారు. వాహనాల గమ్యం, చలనం, స్థితి వంటి సమాచారం రియల్ టైమ్లో జిల్లా కంట్రోల్ రూమ్కు అందుబాటులోకి వస్తుంది. ఇది రెస్పాన్స్ టైంను గణనీయంగా తగ్గించడంలో కీలక పాత్ర పోషిస్తుంది. ఈ చర్య వేగవంతమైన, సమర్థవంతమైన సేవలు అందించేందుకు దోహదపడుతుందన్నారు.



## తొలితరం ఆదివాసీ ఉద్యమ నాయకుడు సిడాం శంబు విగ్రహం ఏర్పాటుకు
# సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే

**ఉట్నూర్, జూలై 14 (ప్రభాత సమాచారం)**

తొలితరం ఆదివాసి ఉద్యమకారుడు సిడాం శంబు విగ్రహం ఏర్పాటుకు ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ సానుకూలంగా స్పందించారు. సోమవారం సిడాం శంబు వారసుడు సిడాం లచ్చు, ఆదివాసీ నాయకులతో కలిసి ఎమ్మెల్యేను కలిశారు. ఆదివాసి తొలితరం నాయకుడుసిడాం శంబు అమరుడై సంవత్సరాలు గడుస్తున్న ఇంత వరకు ఆయన విగ్రహం ఏర్పాటు చేయలేదని, విగ్రహం లేకుండానే ప్రతి ఏటా వర్ధంతి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని వారు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ఈ సంవత్సరం తమరు విగ్రహం ఏర్పాటు చేసి వర్ధంతి సభ జరుపాలని కోరారు. ఈ విషయంపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు.

## కాంగ్రెస్ కార్యకర్తను పరామర్శించిన
# ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

**ఉట్నూర్, జూలై 14 (ప్రభాత సమాచారం)**

మండలంలోని హస్నాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్త జావిద్ అనారోగ్యంతో బాధపడుతున్నారు.విషయాన్ని తెలుసుకున్న ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ జావిద్ ను పరామర్శించారు.ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

